ప్రజాశక్తి
విజయవాడ
శుక్రవారం
జనవరి - 5
2018
పేజీలు 12



ఎంబి స్టేడియంలో జరిగిన జన్మభూమి సభలో సిపిఎం నేతలు రమణారావు తదితరులు అరెస్టు చేసి తీసుకెళుతున్న పోలీసులు

# ధమాల్...

**చంద్రన్న విలేజ్ మాల్‌లో క్షీణించిన అమ్మకాలు**

**పునరుద్ధరణకు నోచుకోని నిత్యావసరాల విక్రయాలు**

**రోజువారీ విక్రయాలు రూ.1600 మాత్రమే**

**డీలరు కమీషన్ రోజుకు రూ.128**

**అద్దెలు, కరెంటు, నెట్ బిల్లులకు చాలని ఆదాయం**

**రేషన్ దుకాణాన్ని మాల్‌గా మార్చేందుకు ముందుకు రాని డీలర్లు**

**ప్రజాశక్తి-విజవాడ అర్బన్ ప్రతినిధి**

చంద్రన్న విలేజ్ మాల్‌లో అమ్మకాలు దారుణంగా క్షీణించాయి. రిలయన్స్ సంస్థ నిత్యావసరాల వస్తువుల ధరలు సవరించి విక్రయాలు పునరుద్ధరించలేదు. కేవలం ఫ్యాన్సీ



సరుకులు విక్రయాలకే పరిమితమైంది. రేషన్ డీలరుకు అద్దెలు, కరెంటు, నెట్ బిల్లుల చెల్లింపుకు కూడా వచ్చే ఆదాయం చాలడం లేదు.

విజయవాడ విద్యాధరపురంలోని 15వ నెంబర్ రేషన్ దుకాణాన్ని చంద్రన్న విలేజ్ మాల్‌గా మార్చి ఈనెల 12 నుంచి 320 రిలయన్స్ సంస్థ సరుకుల విక్రయాలను చేపట్టారు. విలేజ్ మాల్‌లో రిలయన్స్ కంపెనీ సరుకు వినియోగదారులకు 12 శాతం, డీలరుకు కమీషన్‌గా 8 శాతం ఇస్తామని ప్రభుత్వం పేర్కొంది. దీనిలో ఫ్యాన్సీ సబ్బులు, సర్ఫులు, టూత్ బ్రెష్‌లు, పేస్టులు, కాస్మొటిక్స్ బాడీ స్ప్రేలు, డియోడ్రెండ్‌లు ధరలు 10 శాతం నుంచి 15 శాతం తక్కువగా ఉన్నాయి. సామాన్యులు వాడే నిత్యావసర సరుకులు బియ్యం, ఉప్పు, పప్పులు, రవ్వలు, చింతపండు, పంచదారలు మార్కెట్‌లో నెంబర్ వన్ రకం సరుకులు ధరలకన్నా 25 నుంచి 75 శాతం వరకు అదనంగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వం తీవ్ర విమర్శలకు గురైంది. ఈనెల 14వ తేదీ నుంచి విలేజ్‌మాల్‌లో నిత్యావసర సరుకుల విక్రయాలను నిలిపివేశారు. తిరిగి ధరలు సవరించి రెండు రోజుల్లో విక్రయాలు చేపడతామని రిలయన్స్ సంస్థ ప్రతినిధులు, పౌరసరఫరాలశాఖ అధికారులు చెప్పారు. ఆరు రోజులైనా ధరలను సవరించి తిరిగి విక్రయాలను పునరుద్ధరించలేదు. మాల్ కాస్తా ఫ్యాన్సీ, కాస్మొటిక్ సరుకుల

మిగతా 4లో

**జన్మభూమి-మా ఊరులో**

# అరెస్టుల పర్వం

**52, 54 డివిజన్లలో సిపిఎం నేతల అరెస్టు**

**నిరసనగా స్టేషన్ వద్ద ధర్నా**

**ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ ప్రతినిధి**

'జన్మభూమి– మా ఊరు కార్యక్రమంలో అరెస్టుల పర్వం మూడో రోజు కొనసాగింది. 52 వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలో జరిగిన జన్మభూమి – మా ఊరు కార్యక్రమంలో ప్రజా సమస్యలపై వినతిపత్రం అందిచేందుకు వెళ్లిన సిపిఎం నేతలను అరెస్టు చేశారు. కాలినడకనే స్టేషన్‌కు తరలించారు. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్టేషన్‌లోనే నిర్బంధించారు. నేతలను రహస్యంగా ఆటోలో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నించడంతో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ నాయకులు స్టేషన్ వద్ద ధర్నా చేశారు. దీంతో నేతలను విడుదల చేశారు. వివరాల్లోకెళితే...

సిపిఎం 52 డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో వాంబేకాలనీ వాసులు ఇళ్ల రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని, అర్హులైన వారికి ఇళ్లు కేటాయించాలని జన్మభూమి– మా ఊరు కార్యక్రమం వినతిపత్రం అందించేందుకు వెళ్లారు. ఈక్రమంలో అక్కడ ఉన్న పోలీసులు సిపిఎం డివిజన్ నాయకులు టి. శ్రీనివాస్, ఎస్‌కె.మోయిద్దీన్‌లను అరెస్టు చేశారు. వినతిపత్రం ఇస్తామని చెప్పినా అంగీకరించలేదు. అరెస్టు చేసిన నాయకులను కేర్ అండ్ కేర్ స్కూల్ నుంచి అజిత్ సింగ్ నగర్ రాజరాజేశ్వరిపేట పోలీసు స్టేషన్ వరకు అరకిలో మీటరు వరకు నేతలను నడిపిస్తూనే తీసుకెళ్లారు. సాధారణంగా పోలీసులు ముందస్తు అరెస్టు చేసినా సాయంత్రం విడుదల చేయడం రివాజుగా వస్తోంది. అయితే దీనికి విరుద్ధంగా అదుపులోకి తీసుకున్న ఇద్దరు నాయకులను ఆటో ఎక్కించి రహస్యంగా ఇతర ప్రాంతానికి తరలించేందుకు పోలీసులు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న సెంట్రల్ సిటీ కమిటీ నాయకులు అక్కడకు చేరుకుని ఆటోను అడ్డగించారు. పోలీసు స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. పోలీసు జులుం నశించాలని నినాదాలు చేశారు. దీంతో పోలీసులు సిపిఎం నేతలను వదిలివేశారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు కె.దుర్గారావు మాట్లాడుతూ సమస్యలు చెప్పుకునేందుకు వెళితేనే అరెస్టు చేయడం దారుణమని, జన్మభూమి– మా ఊరు కార్యక్రమం పోలీసులు కనుసన్నల్లో నిర్వహించడం, ప్రజా సమస్యలు చెప్పుకునేందుకు

మిగతా 4లో

# నగరాన్ని తాకిన కిడ్నీ రాకెట్

**అనుమతి లేకుండా చేశారని ఆరోపణలు ❀ నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ సేకరణ**

**❀ నగరంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో ట్రాన్స్‌ప్లాంటేషన్ ❀ అనుమతి ఉందన్న యాజమాన్యం**

**ప్రజాశక్తి - హెల్త్ యూనివర్శిటీ**

గుంటూరులో కలకలం రేపిన కిడ్నీ రాకెట్ వ్యవహారం విజయవాడ నగరాన్ని తాకింది. అక్కడ బయటపడిన కిడ్నీ రాకెట్‌కు సంబంధించి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స విజయవాడలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేయడమే కారణం. గుంటూరు చంద్రమౌళిపురంకు చెందిన చిగురుపాటి శివనాగేశ్వరరావుకు రెండు కిడ్నీలు పాడవడంతో తొలుత గుంటూరులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో ట్రాన్స్‌ప్లాంటేషన్ కోసం డిసెంబరు 1న అనుమతి తీసుకున్నాడు. అయితే అక్కడ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయడం కష్టమని చెప్పడంతో అదే అనుమతి లేఖను తీసుకుని విజయవాడ ఆయుష్ ఆసుపత్రికి వచ్చాడు. ఇక్కడ డోనర్‌ను, రోగిని పరీక్షించి డిసెంబరు 29న ట్రాన్స్‌ప్లాంటేషన్ చేశారు. ప్రస్తుతం కిడ్నీ ఇచ్చిన దేవరగట్టు గోపి, రోగి శివనాగేశ్వరరావు కోలుకుంటున్నట్లు ఆయుష్ ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.

**నిబంధనలకు విరుద్ధం**

కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌ను గుంటూరు ఆసుపత్రిలో చేయిస్తున్నట్లు గుంటూరులోని ప్రభుత్వాసుపత్రిలో బోర్డు నుండి అనుమతి తీసుకున్నారు. అయితే అనుమతి తీసుకున్న ఆసుపత్రిలో కాకుండా మరో ఆసుపత్రిలో ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సి వచ్చినపుడు ఈవిషయాన్ని అనుమతి ఇచ్చిన బోర్డుకు సమాచారం తెలియచేయాల్సి ఉంటుంది. కానీ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయించుకున్న రోగిగానీ, ఆసుపత్రి యాజమాన్యంగానీ సమాచారం ఇవ్వలేదని తెలిపింది. ఇది నిబంధనలకు విరుద్ధమని చెబుతున్నారు. మరోవైపు కిడ్నీ డోనర్ కూడా బంధువు కాదని తేలింది. తప్పుడు పత్రాలు పుట్టించి బంధువుగా పేర్కొన్నట్లు తెలిసింది. మెడికల్ బోర్డు ఇచ్చిన అనుమతి పత్రంలో సైతం డోనర్ దేవరగట్టు గోపి తండ్రిపేరు శివనాగేశ్వరరావు ఉండటమే ఇందుకు నిదర్శనమని అంటున్నారు. ఇలా చేయడం నేరమని అంటున్నారు. ఇదిలా ఉంటే కిడ్నీ దానం చేసే వ్యక్తి రోగి బంధువు కాకుండా అప్రూవల్ ఇవ్వడం విరుద్ధమంటున్నారు. ఈవ్యవహారంలో

మిగతా 4లో

విజయవాడ గాంధీనగర్‌లోని ఆకృతి ప్రిన్‌టెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఫొటో ప్రింట్ మిషన్ కెనాన్ డ్రీమ్ ల్యాబో-500ను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గురువారం ప్రారంభించారు.



# కెనాన్ డ్రీమ్ ల్యాబో-500 ఆవిష్కరణ

**ప్రజాశక్తి - సత్యనారాయణపురం**

విజయవాడ గాంధీనగర్‌లోని ఆకృతి ప్రిన్‌టెక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నందు నూతనంగా ఏర్పాటు చేసినఫొటో ప్రింట్ మిషన్ కెనాన్ డ్రీమ్ ల్యాబో-500ను రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రపంచంలో వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్ని రంగాలవారు అందిపుచ్చుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో మొదటిసారి ఆధునిక యంత్రాన్ని నవ్యాంధ్ర రాజధాని విజయవాడలో ఏర్పాటు చేసినందుకు సంస్థ నిర్వాహకులను అభినందించారు. వివాహాలు, సెలబ్రిటీల కార్యక్రమాలను మధురమైన జ్ఞాపకాలను ఫోటోల రూపంలో భద్రపరుచుకోవటం జరుగుతుందన్నారు. అలాంటి అమూల్యమైన ఫోటోలను ఆధునిక టెక్నాలజీతో స్పష్టంగా,


తొలిప్రింట్‌ను చూపిస్తున్న మంత్రి ఉమామహేశ్వరరావు

ఆందంగా తీసుకునే వీలు ఉండటం ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ యంత్రం ద్వారా పెద్ద మొత్తంలో ఫోటోలను ప్రింట్ తీసుకోవటానికి అవకాశం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయసాధనకోసం ప్రతీ ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని సూచించారు. సంస్థ నిర్వాహకులు పి. సాంబశివరావు మాట్లాడుతూ ఈ కొత్త పరిజ్ఞానానంతో ఫోటోప్రింటింగ్ ఎంతో స్పష్టత ఉంటుందని పేర్కొన్నారు. గడచిన ఆరు సంవత్సరాల నుండి ఆకృతి వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందిస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఫోటోప్రింటింగ్‌లో ఈ విధమైన పరిజ్ఞానం దేశంలోనే 5వదని తెలిపారు. ఫోటోగ్రఫీ రంగంలో నేడు వస్తున్న నూతన పరిజ్ఞానాన్ని ఫోటోగ్రాఫర్లకు తెలిపే విధంగా మన కళ్యాణ మండపంలో వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మధ్య నియోజకవర్గ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, తెలుగు యువత నాయకులు దేవినేని అవినాష్, 42వ డివిజన్ కార్పొరేటర్ ముప్పా వెంకటేశ్వరరావు, నిర్వాహకులు పి.మధుసూధనరెడ్డి, కానన్ ప్రొఫెషనల్ ప్రింటింగ్స్ డైరక్టర్ పునీత్ దత్తా, ఆకృతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తుర్లపాటి కుటుంబరావు

## నాగయ్య సినిమాలు ఆణిముత్యాలు

**ప్రజాశక్తి - సత్యనారాయణపురం**

తొలితరం అగ్రశ్రేణి నటుడు చిత్తూరు నాగయ్య సినిమాలు ఆణిముత్యాలని పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు అన్నారు. నివేదిత సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో పద్మశ్రీ వి.నాగయ్య 44వ వర్థంతిని నిర్వహించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో తుర్లపాటి మాట్లాడుతూ నాగయ్య నటుడుగానే కాకుండా గొప్ప గాయకుడని తెలిపారు. పోతన, వేమన, రామదాసు వంటి వాగ్గేయకారులు, భక్తిరస ప్రధానమైన చిత్రాల్లో నటించారన్నారు. దాదాపు 200 చిత్రాల్లో నటించి తెలుగుసినిమా పరిశ్రమలో ఆగ్రశేణి నటుడుగా పేరుతెచ్చుకున్నారని వివరించారు. ముందుగా నాగయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సమాజిక సేవా కార్యకర్తలు కొల్ల వెంకట భుజంగరావు, మాదాల పాండురంగారావులను నిర్వాహకులు సత్కరించారు. పేద మహిళలకు నిత్యావసరాలు అందజేశారు. ఈ సందర్భంగా చందు చేసిన మిమిక్రి, చిన్నారులు ఆలపించిన దేశభక్తిగీతాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో నివేదిత సంక్షేమ సేవా సంఘం గౌరవాధ్యక్షుడు ప్రభల శ్రీనివాస్, అధ్యక్షురాలు కొత్తజ్యోతి, కార్యదర్శి ఐలాపురం శ్రీదేవి, పరుచూరి విజయలక్ష్మి, దారా కరుణశ్రీ, బొలిశెట్టి.రాధకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం విడుదల చేస్తున్న నాయకులు

## 8న విద్యుత్ బిసి ఉద్యోగుల రాష్ట్ర మహాసభ

**ప్రజాశక్తి - గాంధీనగర్**

ఈ నెల 8 న ఏపి విద్యుత్ బిసి ఉద్యోగుల సంక్షేమ సంఘం 12 వ రాష్ట్ర మహాసభ జరగనుందని, ఆ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి జెడ్ వి గణేష్ తెలిపారు. స్థానిక గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో మహాసభ కరపత్రాన్ని గురువారం ఆ సంఘ సభ్యులతో ఆవిష్క రించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ బిసిలకు జరుగుతున్న అన్యాయం, వారు ఎదుర్కొంటున్న ఉద్యోగ నియామకాల్లో అక్రమాలను అరికట్టుటకు, బిసిల కుల సర్టిఫికెట్స్ అవకతవకలు అరికట్టుట, బిసి ఎద్యోగుల ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు కల్పించుట తదితర సమస్యల పరిష్కార దిశగా ఈ మహాసభద్వారా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియ జేసేవిధంగా జరుగుతుందన్నారు. ఏపి ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంలలో పని చేస్తున్న బిసి ఉన్నతాధి కారులు, బిసి సంఘాల నాయకులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం 2018 డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. విజయవాడ బెంజి సర్కిల్ జ్యోతి దియేటర్ సిగ్నల్ ఎదురుగా గల ఎస్‌విఎస్ కళ్యాణ మండపంలో జరగనుందని విద్యుత్ బిసి ఉద్యోగులు హాజరు కావాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎం పూర్ణచంద్రరావు, కార్యదర్శి పి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు విడివి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఐద్వా ఆధ్వర్యాన సావిత్రిబాయి పూలే జయంతి




**ప్రజాశక్తి- మొగల్రాజపురం**

విద్యార్థులు చదువుతో పాటు మన చుట్టు ప్రక్కల జరుగుతున్న ఆంశాలను తెలుసుకోవాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. సావిత్రిబాయి పూలె జయంతిని పురస్కరించుకుని గురువారం సూర్యారావుపేటలో గల కర్నాటి రామమోహనరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. సావిత్రిబాయి పూలె మహిళల విద్యను ప్రోత్సహించి, మగ వారితో మహిళలు సమానమేనని చాటి చెప్పినట్లు తెలిపారు.ముడాచారాలను తుద ముట్టించడానికి నిత్యం పోరాటం చేశారన్నారు.దళిత, శూద్ర వర్గాలకు చెందిన వారికి చదువు అందించాలని జ్యోతీరావు పూలె, సావిత్రిబాయి పూలె పాఠశాలను ప్రారంభించినట్లు తెలిపారు.అగ్ర కులాలు ఎన్ని అడ్డంకులు కలిగించిన మహిళలకు విద్య భోదించడానికి అమె చేసిన కృషి అభినందనీయమన్నారు. సావిత్రిబాయి పూలె దంపతులు నిరంతరం అణగారిన వర్గాల అభివృద్ధికి కృషి చేశారన్నారు.సత్యశోధన, హేతుబద్దతను సమాజానికి అందించినట్లు తెలిపారు. ప్లేగు వ్యాదిగ్రస్తులను చేరదీసి వారికి సేవ చేసి చివరకు ప్లేగు వ్యాది సోకి సావిత్రిబాయి పూలె మరణించినట్లు పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలె ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎక్కువ విషయాలు తెలుసుకోవడానికి ప్రయత్నించాలన్నారు. ఇంగ్లీష్ భాషను నేర్చుకోవాలని, అదే సమయంలో మాతృభాష తెలుగును మర్చిపోకూడదని సూచించారు.మహిళలు అన్ని రంగాలలో మగవాళ్ల కు దీటుగా రాణిస్తున్నారని తెలిపారు.ఐద్వా సెంట్రల్ సిటీ కార్యదర్శి కె.సరోజ మాట్లాడుతూ గతంలో కార్పొరేటర్ గా పని చేసిన కాలంలో ఈ పాఠశాల అభివృద్ధి కోసం పలు కార్యక్రామాలు చేపట్టినట్లు గుర్తు చేశారు.మహిళల విద్య కోసం సావిత్రిబాయి పూలె అహర్నిశలు పాటుపడినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, అద్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో క్షుద్ర పాలన : వైసిపి

**ప్రజాశక్తి- మొగల్రాజపురం**

రాష్ట్రంలో క్షుద్ర పాలనను రాష్ట్ర ప్రజలు అనుభవిస్తున్నారనీ, టిడిపి నాయకులు క్షుద్ర శక్తులుగా మారారని వైసిపి తూర్పు సిటీ సమన్వయ కర్త బొప్పన భవకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యంగా విజయవాడలో కనకదుర్గమ్మ ఆలయంలో క్షుద్ర పూజలు జరిపించిన చంద్రబాబు, నారాలోకేష్ ఇద్దరు నగరాన్ని భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. ఇంద్రకీలాద్రి ఆలయంలో క్షుద్రపూజలు జరిపించి ఇంద్రకీలాద్రి అమ్మవారి ప్రతిష్ఠను భంగం చేశారన్నారు. అంతేకాక దీని వలన రాష్ట్రానికి అరిష్టం కలుగుతుందని సాక్షాత్తు శారాద పీఠాధిపతులు స్వరూపనంద ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిపారు. విజయవాడను భ్రష్టు పట్టించడానికి చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నట్లు తెలిపారు. నగరంలోని పిడబ్ల్యూడి గ్రౌండ్స్ ను చైనా సంస్థలకు, అలాగే పురాతన చరిత్ర కలిగిన మున్సిపల్ కార్పొరేషన్ భవనం ను, త్వరలో మరిన్ని చారిత్రాత్మిక ప్రదేశాలను విదేశి సంస్థలకు తాకట్టు పెట్టారని అన్నారు. నగర ప్రజలు చంద్రబాబు, లోకేష్‌లను తరిమికొట్టాలని అన్నారు.


రైల్వే పార్శిల్ కార్యాలయం వద్ద ఉన్న సరుకు

## అక్రమంగా తరలిస్తున్న సరుకు స్వాధీనం

**ప్రజాశక్తి - గాంధీనగర్**

రైల్లో అక్రమంగా పలు ప్రాంతాల నుంచి నగరానికి తరలించిన సరుకును స్వాధీనం చేసుకున్నామని కమర్శియల్ ట్యాక్స్ రాష్ట్ర అదనపు కమిషనర్ యు ఏడుకొండలు స్థానిక విలేకరులకు గురువారం తెలిపారు. రాష్ట్ర ఛీఫ్ కమీషనర్ జె శ్యామలరావు ఆదేశాలమేరకు రైల్వే పార్విల్ కార్యాలయంలో తణికీలు చేపట్టామన్నారు. ఈ తణికీల్లో రూ 38 లక్షల విలువైన బిల్లులు లేని సరుకును గుర్తించామన్నారు. విజయవాడ నగరానికి చెందిన పలువురు వ్యాపారులు,హౌరా, నాగ్‌పూర్, జబల్‌పూర్ నగరాలనుంచి రడీమేడ్, క్లాత్, ఎలట్రికల్ వస్తువులను రైల్లో తరలించారన్నారు. వాటిని సీజ్ చేసి కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ దాడుల్లో విజయవాడ డివిజన్ ఒకటి జాయింట్ కమీషనర్, కిరణ్ కుమార్, డివిజన్ రెండు జాయింట్ కమీషనర్ వి రఘునాధ్, సీతారాం పురం సిటిఓ సైలజశ్రీ, సిటిఒ సిబ్బంది, ఆర్‌పిఎఫ్ స్టేషన్ సిఐ జివిఆర్ కుమార్ ఆధ్వర్యాన ఎస్ఐ సుబ్బారావు, ఆర్‌పిఎఫ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో జిల్లాల సంఖ్యను పెంచాలి

**ప్రజాశక్తి - సత్యనారాయణపురం**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 13 జిల్లాలను పరిపాలనా సౌలభ్యం కోసం 26 జిల్లాలుగా చేయాలని ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు షేక్.జలీల్ డిమాండ్ చేశారు. ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సీట్లను 175 నుంచి 225కు పెంచాలని, వాటిలో ముస్లింలకు ప్రాధాన్యత కల్పించాలన్నారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా 'ముస్లింల ఆత్మగౌరవ చైతన్య యాత్ర' చేపట్టనున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్.రషీద్ మాట్లాడుతూ నూర్ భాషాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెయ్యి కోట్లు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజధాని అమరావతిలో జుమా మసీదు, ఇస్లామిక్ యూనివర్శిటీ, హౌజ్‌హౌస్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మౌలానా షేక్ ఆరిఫ్ పాషా, గుంటూరు జిల్లా అధ్యక్షుడు షేక్. షాజీ పాల్గొన్నారు.

# ఇళ్ల పట్టాల సమస్యలపై సిపిఎం వినతి

**ప్రజాశక్తి - సత్యనారాయణపురం**

ఇళ్ల పట్టాల సమస్యలపై సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. జన్మభూమి-మా వూరు కార్యక్రమం గురువారం ఎస్ఆర్ఆర్ అండ్ సివిఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి సునీత నేతృత్వంలో గర్భిణిలకు సామూహిక సీమంతం నిర్వహించారు. ఎమ్మెల్యే సారె కిట్టును మహిళలకు అందించారు. అనంతరం డివిజన్‌లో మంజూరైన 115 మందికి ఫించన్లు, 176 మంది రేషన్ కార్డులు, డ్వాక్రా గ్రూపులకు రివాల్వింగ్ ఫండ్ అందజేశారు. ఈ సందర్భంగా 5వ డివిజన్ పరిధిలో కాల్వగట్లపై ఉన్న నివాసాలను తొలగించవద్దని, ఎస్ఆర్ఆర్ కళాశాలలో దాతలు ఇచ్చిన భూములను కబ్జాదారుల నుంచి విముక్తి చేయాలని, కాకాని నగర్‌లోని ఇళ్లకు రిజిస్ట్రేషన్ పట్టాలు ఇవ్వాలని ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం 5వ డివిజన్ కార్యదర్శి జి.నాగరాజు ఎమ్మెల్యే బోండా ఉమాకు వినతి పత్రం అందజేశారు. ఈ సభకు డివిజన్ కార్పొరేటర్ కంచర్ల శేషారాణి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ తహసీల్దార్ శివరావు, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వెలగా జోషి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు నాగరాజు

# హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

**ప్రజాశక్తి- మొగల్రాజపురం**

హత్యాయత్నం కేసులో నిందితుడికి ఏడు సంవత్సరాలు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ 5వ అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి బబిత గురువారం తీర్పు చెప్పారు. భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో 2015లో సెక్షన్ 307 ఐపిసి కేసులో ఏసుపోగు డానియేలు నిందితుడు. కేసు వివరాల ప్రకారం భవానీపురంకు చెందిన యరమాల కృష్ణవేణి భవానీపురం బ్యాంకు సెంటర్‌లో టిఫిన్ బండి పెట్టుకుని జీవిస్తుంది. ఈ క్రమంలో తన తమ్ముడి ద్వారా పరిచయమైన ఏసుపోగు డానియేలు తన అవసరాల నిమిత్తం కృష్ణవేణి వద్ద రూ.15 వేలు అప్పుగా తీసుకున్నాడు. డబ్బులు విషయమై కృష్ణవేణి దానియేలును ఎన్ని సార్లు అడిగిన ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడు. ఈ క్రమంలో 2015 జూన్ 27వ తేదీ రాత్రి సుమారు 8.30 గంటల ప్రాంతంలో కృష్ణవేణి ఆటోలో కె.ఆర్.మార్కెట్‌కు వెళ్తుండగా మార్గం మధ్యలో నిందితుడైనా డానియేలు కలిసి ఇబ్రహీంపట్నంలో ఓ వ్యక్తి డబ్బులు ఇస్తాడని, తోడుగా రావాలని కృష్ణవేణిని కోరాడు. ఇది నిజమేనని నమ్మిన కృష్ణవేణి నిందితుడితో కలిసి ఆటోలో వెళ్ళింది. ఈ క్రమంలో నల్లగుంట గ్రామంలోని జిఎంసి ట్రాన్స్‌ఫోర్టు కార్యాలయం ఎదుట డానియేలు పథకం ప్రకారం ఆమెను చంపాలనే ఉద్దేశంతో ముందుగా తన వెంట తెచ్చుకున్న బ్లేడ్‌తో కృష్ణవేణి గొంతు క్రింద భాగంలో కోసి ఆటోలో నుంచి దూకి పారిపోయాడు. బాధితురాలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భవానీపురం ఎస్ఐ చింతా రామకృష్ణుడు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హజరుపరిచారు. విచారణలో డానియేలుపై నేరం రుజువు కావడంతో జైలు, జరిమాన విధించారు.

# చీరల దొంగలు అరెస్టు

## రూ.20 వేల చోరీ సొత్తు స్వాధీనం

**ప్రజాశక్తి- మొగల్రాజపురం**

అంతర్ రాష్ట్ర చీరల దొంగలు తొమ్మిది మంది ముఠా సభ్యులను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. వీరి వద్ద నుండి సుమారు రూ.20 వేల విలువైన చీరలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులకు పక్కా సమాచారం అందడంతో యనమలకుదురు లోటస్ మార్ట్ వద్ద గల వెంకటేశ్వర టవర్స్‌లోని ముఠా నాయకురాలి ఇంట్లో సమావేశమై ఉన్న తొమ్మిది మంది మహిళలను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు షాపులలో చీరలు దొంగిలించినట్లు వెల్లడి కావడంతో వారిని అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురుకు చెందిన కంపా రత్నాలు (ప్రధాన నిందితురాలు), రామలింగేశ్వరనగర్‌కు చెందిన దేవరకొండ శారద, కట్టా యశోద, సాదుపాటి వెంకటేశ్వరమ్మ, సాదుపాటి తిరుపతమ్మ, జి.కొండూరు మండలం చెవిటూరుకు చెందిన పొన్నూరు మల్లి, చిలుకూరి నాగమణి (అలియాస్ బుజ్జి), గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన చదల కనకదుర్గ నిందితులందరూ బంధువులు. వీరంతా విజయవాడ పరిసర ప్రాంతాల్లో అద్దెకు ఇళ్లు తీసుకుని ఖరీదైన వ్యక్తల మాదిరిగా నివాసముంటారు. ఈ క్రమంలో విజయవాడ, ఇతర రాష్ట్రాల్లో ఖరీదైన చీరల షాపులను




పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

దొంగతనం చేయడానికి ఎంచుకుని చీరలు కొనేవారిలా షాపులలోకి ప్రవేశిస్తారు. షాపు వారిని మాటల్లో పెట్టి ఖరీదైన చీరలు చూస్తున్నట్లు నటిస్తూ అవలీలగా చేతి వాటం ప్రదర్శించి చీరలను వారి కొంగులలో దోపుకుని ఎవరికీ అనుమానం రాకుండా అక్కడి నుండి జారుకుంటారు. ఈ నేపథ్యంలో గత నెల డిసెంబర్ 2న పెనమలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని తాడిగడప సెంటర్‌లో గల చీరల షాపులోకి ప్రవేశించి ఖరీదైన ఏడు చీరలను చాకచక్యంగా దొంగిలించారు. షాపు యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసు షాపులోని సిసి కెమేరాలోని ఆధారాలతో నిందితులను గుర్తించి అరెస్టు చేశారు.

# రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి

**ప్రజాశక్తి-గన్నవరం**



మృతి చెందిన భాషా

గన్నవరం మండలం కేసరపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం విజయవాడ రామకృష్ణాపురానికి చెందిన భాషా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం రాత్రి గోసాల ఏరియాలోని బంధువుల ఇంట్లో జరిగే కార్యక్రమంలో పాల్గొని తిరిగి ఇంటికి వెళ్లడానికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. అయితే బంధువులు ఆగిరపల్లికి చెందిన సాయికిరణ్‌ను గన్నవరంలో వదిలిపెట్టి విజయవాడ వెళ్లాలని చెప్పారు. దీంతో ఇద్దరు కలిసి కంకిపాడు మీదుగా ఉప్పలూరు నుంచి కేసరపల్లి వద్దకు వచ్చి బైపాస్ రోడ్డు క్రాస్ చేస్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. గన్నవరం నుంచి విజయవాడ వెళ్తున్న లారీ వారిని ఢీ కొట్టడంతో బాషా తీవ్రంగా గాయపడగా కిరణ్‌కు స్వల్పగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో భాషాను విజయవాడలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిఐ ఆద్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఈవ్‌టీజర్లకు కౌన్సెలింగ్

**ప్రజాశక్తి- మొగల్రాజపురం**

మహిళ రక్షక్ బృందాల ఆధ్వర్యంలో 107 మంది ఈవ్‌టీజర్‌లకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. నగర పోలీస్ కమిషనర్ డి.గౌతం సవాంగ్ ఆదేశాల మేరకు పోలీసులు ఈవ్‌టీజింగ్ జరిగే ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాలలో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరుగుతుంది. ఈ క్రమంలో పట్టుబడిన ఈవ్‌టీజర్లలో మార్పు తీసుకువచ్చేందుకు వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుంది. ఈ క్రమంలో గత నెల డిసెంబర్ 17 నుండి ఈ నెల 3వ తేదీ వరకు నగరంలోని స్టెల్లా కాళాశాల, పంటకాలువ రోడ్డు, ముస్తాబాదరోడ్డు, నున్న స్వర్ణ థియేటర్, ట్రెండ్‌సెట్, గన్నవరం సెంటర్, ఉయ్యూరు బస్టాండ్, పద్మావతి ఘాట్, పిడబ్ల్యూడి గ్రౌండ్, రైల్వే డిఆర్‌ఎం ఆఫీస్, రైల్వే కాలనీ, అజిత్‌సింగ్ నగర్, దేవి నగర్, కె.బి.యన్ కాలేజ్, గాంధీ హీల్ డౌన్, కె.ఎల్.రావు పార్క్, గాంధీ కాలేజ్, అప్సరా థియేటర్, వై.ఎస్.ఆర్ కాలనీ, పంజా సెంటర్, చిట్టినగర్ వాగు సెంటర్, కంకిపాడు బస్టాండ్, కృష్ణవేణి ఘాట్, సత్యనారాయణపురం



మాట్లాడుతున్న డిసిపి గజరావు భూపాల్

ఏరియా, ఎ.కె.టి.ఎం పాఠశాల, శారద కళాశాలల ప్రాంతాలలో మహిళలను ఈవ్‌టీజింగ్ చేస్తున్న 107 మందిని అదుపులోకి తీసుకున్నాడు. ఈవ్‌టీజర్లకు పటమటలోని వాసవ్య మహిళా మండలిలో చెన్నుపాటి విద్య ఆధ్వర్యంలో మహిళా మండలి, మహిళా మిత్ర సభ్యులతో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈవ్‌టీజంగ్ వల్ల కలిగే నష్టాలు, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే విధించే చట్టాలపై వివరించి కౌన్సిలింగ్ ఇచ్చారు. కార్యక్రమంలో డిసిపి గజరావు భూపాల్, విజయవాడ మహిళా పోలీస్‌స్టేషన్ ఏసిపి నాయుడు, మహిళా మండలి సభ్యులు చెన్నుపాటి విద్య, మహిళా మిత్ర సభ్యులు, మహిళా రక్షక్ బృందాలు పాల్గొన్నారు.


# విచారణకు తీసుకువస్తున్న నిందితుడికి అస్వస్థత

**ప్రజాశక్తి-మొగల్‌రాజపురం**

ఓ కేసు విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు తీసుకువస్తుండగా నిందితుడు తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో అతన్ని చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్ ఆసుపత్రికి తరలించారు. సేకరించిన వివరాల మేరకు మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని విజయనగర్ కాలనీ కోదండ రామాలయం ప్రాంతానికి చెందిన జంపన కృష్ణవేణి అనే మూగ, చెవిటి యువతిని మోసం చేశాడని బాధితురాలి బంధువులు మాచవరం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. దీంతో స్థానిక సున్నపు బట్టీల సెంటర్‌లో నివాసముండే తెలంగాణకు చెందిన పూల చెన్నకేశవులు అనే ఆటో డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో విచారణకు తీసుకువస్తున్న క్రమంలో నిందితులు అస్వస్థతకు గురయ్యాడు.




## కోడి గుడ్డు ధరలు



| విజయవాడ | హైదరాబాద్ | ప.గోదావరి |
|---|---|---|
| రూ.3.85 | రూ.3.90 | రూ.3.85 |
| విశాఖ | చెన్నై | నామకల్ |
| రూ.3.90 | రూ.3.95 | రూ.3.95 |

## కోడి మాంసం ధరలు




| రకం | స్కిన్‌లెస్ | విత్ స్కిన్ |
|---|---|---|
| బ్రాయిలర్ | 178.00 | 157.00 |

## వాతావరణం

| విజయవాడ | శుక్ర | శని | ఆది | సోమ | మంగళ | బుధ | గురు |
|---|---|---|---|---|---|---|---|
| గరిష్టం | 30 | 30 | 30 | 30 | 30 | 31 | 32 |
| కనిష్టం | 17 | 17 | 17 | 18 | 18 | 19 | 19 |

## బులియన్ మార్కెట్



| | | |
|---|---|---|
| 24 క్యారెట్లు | : 3,007 (గ్రాము) | : 30,070 (10గ్రా) |
| 22 క్యారెట్లు | : 2,819 (గ్రాము) | : 28,190 (10గ్రా) |
| వెండి | : 41.93 (గ్రాము) | : 41,928 |

## మీరే రిపోర్టర్ అయితే?

(సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు)

| ప్రాంతం | నెంబరు |
|---|---|
| సిటీ ప్రతినిధి | 9491454756 |
| అర్బన్ ప్రతినిధి | 9490099630 |
| విజయవాడ | 9490099652 |
| విజయవాడ అర్బన్ | 9966108515 |
| భవానీపురం | 9912026686 |
| గాంధీనగర్ | 9492334747 |
| గన్నవరం | 9492525256 |
| కంకిపాడు | 9030747978 |
| గవర్నర్‌పేట | 9032099986 |
| మొఘల్రాజపురం | 9492825220 |
| సత్యనారాయణపురం | 8886782790 |
| ఇబ్రహీంపట్నం | 7675969621 |

## ప్రభుత్వాసుపత్రిలో నేడు ఓపీ వివరాలు

**ప్రజాశక్తి - హెల్త్‌యూనివర్శిటీ**

నగరంలోని పాత, కొత్త ప్రభుత్వాసుపత్రులలో ఉదయం 8.00 గంటల నుండి 11 గంటల వరకు ఓపి చీటీలను రోగులకు అందజేస్తారు.

కొత్త ప్రభుత్వ ఆసుపత్రి

జనరల్ మెడిసిన్ : డాక్టర్ వెంకటకృష్ణ, సాయిలక్ష్మీ, బాల నరసింహులు, డాక్టర్ శశిధర్

జనరల్ సర్జరీ : డాక్టర్ జె.సాంబశివరావు, డాక్టర్ డి.విజయలక్ష్మి

ఆర్థోపెడిక్ : డాక్టర్ అద్దేపల్లి శ్రీనివాసరావు, పవన్‌కుమార్

చర్మవ్యాధులు : డాక్టర్ సంపత్‌కుమార్, డాక్టర్ గంగాభవానీ, పూర్ణిమ, డాక్టర్ రాజగోపాల్

పాత ప్రభుత్వ ఆసుపత్రిలో ...

మానసిక వ్యాధులు : డాక్టర్ వి.రాధికారెడ్డి,

కంటి వ్యాధులు: డాక్టర్ రాజ్‌కుమార్, మాధవీలత, డాక్టర్ పిపి శాస్త్రి.

ఇఎన్‌టి విభాగం : డాక్టర్ సుధీర్‌బాబు, డాక్టర్ స్వరూప్,

పిల్లల విభాగం : డాక్టర్ ఎం.ఎ.రెహమాన్, డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ మురళీకృష్ణ

ప్రసూతి విభాగం : డాక్టర్ వి.ఇందిరాకుమారి, డాక్టర్ రేవతి, డాక్టర్ రత్న, డాక్టర్ కరుణావతి

## రైతు బజారులో కూరగాయల ధరలు

(కిలో.. రూ..లలో) (నిన్నటి ధరలు)

| | | | |
|---|---|---|---|
| టమాటో | 10 | బీన్స్ | 26 |
| వంకాయ | 17 | కాప్సికం | 42 |
| బెండ | 20 | చింత | 24 |
| పచ్చిమిర్చి | 19 | గుమ్మడి | 15 |
| కాకర | 22 | బూడిదగుమ్మడి | 15 |
| బీర | 28 | ఉసిరి | 36 |
| క్యారెట్ | 43 | గోంగూర | 50 |
| దొండ | 18 | చిలగడదుంప | 20 |
| బంగాళదుంప | 12 | పెండలం | 20 |
| ఉల్లి | 40 | బొప్పాయి | 22 |
| గోరుచిక్కుళ్లు | 20 | వేరుశనగ | 56 |
| దోస | 18 | కొత్తిమీర | 5 |
| పెద్దసొర | 8 | పుదీనా | 3 |
| చిక్కుళ్లు | 28 | మామిడి | 22 |
| చామదుంప | 34 | అరటి | 5 |
| అల్లం | 32 | క్యాలీఫ్లవర్ | 10 |
| వెల్లుల్లి | 46 | క్యాబేజీ | 14 |
| కంద | 24 | మునగ | 8 |
| బీట్రూట్ | 22 | ఆకుకూరలు | 5 |
| కీరదోస | 12 | నిమ్మ | 12 |



పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాల చేస్తున్న సిపిఎం నాయకులు

## జన్మభూమి - మావూరులో అరెస్టుల పర్వం

అవకాశం కల్పించకుండా నేతలను అరెస్టు చేయడం సరైనది కాదని సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు కె.దుర్గారావు పేర్కొన్నారు. అరెస్టును తీవ్రంగా ఖండించారు. సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు పి.మాధవ, స్థానిక డివిజన్ నాయకులు బి.రమణ, ఆర్.మణి తదితరులు ధర్నాలో పాల్గొన్నారు.

**54వ డివిజన్‌లో**

54 డివిజన్‌లో మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో గురువారం జన్మభూమి- మా ఊరు కార్యక్రమం జరిగింది. మేయర్ కోనేరు శ్రీధర్, సెంట్రల్ నియోజకవర్గ ఎంఎల్‌ఎ బొండా ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్న ఈ సభలో టిడిపి డివిజన్ నాయకులను జన్మభూమి కమిటీ సభ్యుల పేరుతో వేదికపైకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను డివిజన్ స్థాయి నేతల దృష్టికి తీసుకెళ్లాలని, వారు ఎంఎల్‌ఎ వద్దకు తీసుకెళ్లి పరిష్కరిస్తారని చెప్పారు. పింఛన్లు, రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. ఈసభలో ప్రజా సమస్యలు ప్రస్తావించేందుకు ప్రయత్నించిన సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు బి.రమణారావు, సిపిఎం డివిజన్ కార్యదర్శి పి.ఎస్.ఎన్.మూర్తి, పార్టీ నాయకులు ఎస్.కె.నిజాముద్దీన్, ఇ.సాంబశివరావు, ఎం.సత్యవతి, కొల్లి రత్నంలను అరెస్టు చేశారు. నున్న పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బి.రమణారావు మాట్లాడుతూ సెంట్రల్ సిటీలో ఇళ్లు, ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ల సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం, అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు మూడేళ్లుగా విఫలమవుతున్నారని విమర్శించారు. ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లను అర్హులకు కేటాయించకుండా ఎంఎల్‌ఎలు పంచుకుంటున్నారని విమర్శించారు. ఎక్సెల్ ప్లాటు వద్ద నిర్మించిన ఇళ్లను స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు.

**నున్న స్టేషన్ వద్ద సిపిఎం నేతల ధర్నా**

**అరెస్టులు దారుణం : సిపిఎం పశ్చిమ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ**

జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో ప్రజా సమస్యలు ప్రస్తావించేందుకు అవకాశం కల్పించకుండా తమ పార్టీ స్థానిక నేతలను అరెస్టు చేయడం దారుణమని సిపిఎం పశ్చిమ కృష్ణా కార్యదర్శి డి.వి.కృష్ణ అన్నారు. వెంటనే అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలన్నారు. నేతల అరెస్టుకు నిరసనగా నున్న స్టేషన్ వద్ద సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో డి.వి.కృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాన్ని టిడిపి కార్యక్రమంగా నిర్వహించడం సరైనది కాదని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీదేవి, సిపిఎం నగర కవిటీ సభ్యులు సిహెచ్.శ్రీనివాస్, డి.వెంకటరెడ్డి, టి.సాంబిరెడ్డి, మహిళా సంఘం సెంట్రల్ సిటీ కార్యదర్శి కె.సరోజ, శ్రామిక మహిళా సంఘం నాయకులు శ్రీలక్ష్మి తదితరులు దర్నాలో పాల్గొన్నారు

## నగరాన్ని తాకిన కిడ్నీ రాకెట్

ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసిన వైద్యులు, చేయించుకున్న వ్యక్తి అందరూ బాధ్యులేని చెబుతున్నారు.

అనుమతి తీసుకున్నాం

డాక్టర్ కె.ఎల్.వి.ప్రసాద్, మెడికల్ సూపరింటెండెంట్, ఆయుష్ హాస్పటల్

కిడ్నీ మార్పిడికి సంబంధించి గుంటూరు మెడికల్ బోర్డు నుండి అనుమతి ఉండటం వల్లనే శస్త్ర చికిత్స నిర్వహించామని ఆయుష్ హాస్పటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.ఎల్.వి.ప్రసాద్ తెలిపారు. డిసెంబరు 29న కిడ్నీ మార్పిడి చేయగా, రోగితోపాటు దాత కూడా ఆరోగ్యంగానే ఉన్నారని తెలిపారు. ఈ వ్యవహారంలో ఎటువంటి నిబంధనలు అతిక్రమించలేదన్నారు.

# టిడిపి ప్రచారంలా జన్మభూమి సభలు : సిపిఐ

ప్రజాశక్తి – విజయవాడ అర్బన్ ప్రతినిధి

ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని ఆర్భాటపు ప్రచారంతో ప్రభుత్వం ప్రారంభించిన ఐదో విడత జన్మభూమి సభలు అధికార పార్టీ ప్రచార కార్యక్రమాల మాదిరిగా సాగుతున్నాయని సీపీఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ విమర్శించారు. స్థానిక హనుమాన్‌పేటలోని దాసరి భవన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత జన్మభూమి సభల్లో అందజేసిన అర్జీలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో ప్రస్తుతం నిర్వహిస్తున్న సభలకు జనం రావడం లేదన్నారు. దీంతో పాఠశాలల పిల్లలతో జన్మభూమి సభలు నిర్వహిస్తున్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీలపై ప్రజలు, ప్రతిపక్షాలు, వామక్షాల నాయకులు నిలదీస్తారనే భయంతో పోలీసు పహారా మధ్య జన్మభూమి సభలు నిర్వహించడం సిగ్గుచేటన్నారు. గతంలో ఇళ్ల కోసం సుమారు 3.16లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, ఇప్పటికీ ఒక్కరికి కూడా ఇల్లు ఇవ్వలేదన్నారు. వితంతువులు, వికలాంగులు, వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయడంలేదన్నారు. ఇప్పటికైనా సీఎం చంద్రబాబు జోక్యం చేసుకుని జన్మభూమి సభలను ప్రజాసమస్యల పరిష్కార వేదికలుగా మార్చాలని సూచించారు. జన్మభూమి సభల్లో ప్రతిపక్షాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అప్పుడే ప్రజాసమస్యలు వెలుగులోకి వచ్చి పరిష్కారానికి నోచుకుంటాయని వివరించారు.

# జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనం ప్రారంభం

**తిరువూరు** : సాంకేతికరంగంలో వచ్చిన అధునాతనమైన టెక్నాలజీని ఉపయోగించుకొని నూత నంగా నిర్మించిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవనాన్ని డిజిటల్ స్రీన్ ద్వారా హైదరాబాద్‌లో హైకోర్టు న్యాయమూర్తి వి.రామసుబ్రహ్మణియన్ గురువారం సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభించారు. జిల్లా కోర్టు 12వ అదనపు అడిషనల్ జడ్జి పి.వేణుగోపాల్ పర్యవేక్షణలో నూజివీడుకు చెందిన జిల్లా కోర్టు 15వ అదనపు జడ్జి వెంకటేశ్వరప్రసాద్, అవనిగడ్డ జడ్జి అమరేశ్వరరావు, తిరువూరు జూనియర్ సివిల్ జడ్జి పి.రాజు, న్యాయవాదులు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని తిలకిం చారు. ఈసందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతంలో ఉన్న తిరువూరుకు హైదరాబాద్ నుండి రావాలంటే ఎంతో వ్యయప్రయాసలతో కూడుకున్నందున నూతన టెక్నాలజీతో దీనిని ప్రారంభించామన్నారు. దక్షిణ భారతదేశంలో సాంకేతిక నైపుణ్యంతో ప్రారంభించిన కోర్టు మొట్టమొదటిది తిరువూరు కోర్టు భవనమేనన్నారు. ఇది మిగిలిన కోర్టులకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చే శారు. ఈకార్య క్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు రాజవరపు శ్రీనివాసరావు, సీనియర్ న్యాయవాదులు సంకు రాత్రి జనార్ధనరావు, అత్తునూరు ప్రభాకరరెడ్డి, రేగళ్ల మోహన్‌రెడ్డి, చింతల వెంకటరెడ్డి, మోదుగుమూడి శ్రీనివాసరావు, పల్లెపాటి శ్రీనివాసరావు, కంచర్ల ముత్య ప్రసాద్, నాళ్లా వెంకటసత్యనారాయణ, నాగు బండి రామ కృష్ణ, దారా మాధవరావు, వాకదాని లక్ష్మీ నారాయణ, ఉప్పులూరి నాగప్రసాద్, జి.కృష్ణారెడ్డి, అత్తలూరి శ్రీని వాసరావు, నాగుబండి రమేష్ తదితర న్యాయవాదులతో పాటు ఎస్‌ఐలు లోవరాజు, మోహన్‌రావు పాల్గొన్నారు.



డిజిటల్ స్క్రీన్ ద్వారా కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యాన్ని స్కీన్‌పై చూస్తున్న న్యాయమూర్తులు, న్యాయవాదులు

## ధమాల్...

(మొదటి పేజీ తరువాయి)

**విక్రయాలకే పరిమితమయింది.**

**రోజు విక్రయాలు రూ.1600లు**

తొలుత ప్రచారంతో ఈ మాల్‌లో రోజుకు రూ.7 వేల విక్రయాలు జరిగాయి. ఇదే తరహాలో సరుకు విక్రయాలు జరుగుతాయని ఆశించిన డీలరుకు నిరాశే మిగిలింది. ఈ తరహాలో రెండు రోజులు మాత్రమే విక్రయాలు జరిగాయి. ధరలు అధికంగా ఉండటంతో క్రమేణా వినియోగదారులు మొఖం చాటేశారు. దీనికి తోడు రిలయన్స్ సంస్థ నిత్యావసర సరుకుల విక్రయాలు నిలిపివేసింది. మాల్ విక్రయాలు రోజుకు రూ.1600కు పడిపోయాయి. దీనికిగానూ ప్రభుత్వం ప్రకటించిన విధంగా 8 శాతం కమీషన్ డీలరుకు అందుతుంది, డీలరు రోజు ఆదాయం రూ.128. మాల్‌ను ఆధునీకరించే క్రమంలో విద్యుత్ బల్బులు, కంప్యూటర్, ఆన్‌లైన్ బిల్లింగ్‌కు అనుగుణంగా నెట్ సదుపాయం ఏర్పాటు చేశారు. నెట్ బిల్లు నెలకు రూ.500, కరెంటుకు నెలకు రూ.1000 వరకు ఖర్చు వస్తోంది. వచ్చే ఆదాయంలో సగం ఈ బిల్లుల చెల్లింపుకే సరిపోతుంది. డీలరుకు మిగిలేది రూ.2 వేలు మాత్రమే. షాపు అద్దె, డీలరు రోజువారీ కూలి సైతం గిట్టుబాటుకాని పరిస్థితి నెలకొంది.

**మూడు సంవత్సరాలు అగ్రిమెంట్**

రేషన్ దుకాణాన్ని అత్యాధునిక మాల్‌గా మార్చేందుకు రూ.2.50 లక్షలు వ్యయమైంది. నగరంలోని 15 నెంబర్ దుకాణాన్ని. మోడల్ మాల్‌గా మార్చేందుకైన మొత్తం వ్యయాన్ని రిలయన్స్ సంస్థ భరించింది. దీనికిగానూ రిలయన్స్ సరుకులను మూడు సంవత్సరాలు విక్రయించాలని డీలరుతో ఒప్పందం కుదుర్చుకుంది. నిర్వహణ వ్యయం మాత్రం డీలరు భరించాలి. ఈ క్రమంలో మాల్స్‌లో విక్రయాలు జరగకపోయినా, కమీషన్ ఆశించినంత రాకున్నా డీలరు తప్పని సరిగా రిలయన్స్ సరుకులను విక్రయించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

**డీలర్లు వెనుకంజ**

ప్రభుత్వం తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 6,500 చంద్రన్న విలేజ్ మాల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దశలవారీగా రాష్ట్రంలోని 29 వేల రేషన్ దుకాణాలనూ మాల్స్‌గా మార్చి రిలయన్స్, ఫ్యూచర్ గ్రూపు సరుకుల విక్రయాలు చేపడతామని చెప్పింది. అయితే ప్రస్తుత పరిస్థితిని గమనించిన డీలర్లు తమ దుకాణాలను మాల్స్‌గా మార్చేందుకు వెనుకంజ వేస్తున్నారు.



## ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం

**ప్రజాశక్తి - మచిలీపట్నం**

ఇన్‌స్పైర్ ఎడ్యుకేషనల్ ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్‌ను మాజీ శాసనసభ్యులు పేర్ని వెంకట్రామయ్య గురువారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం వల్ల అనేక మానసిక సమస్యలు తొలుగుతాయని ఈసెంటర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ సమాజ సేవలో ఇదొక భాగమన్నారు. సభాధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ శారీరక రుగ్మతల కన్నా మానసిక సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఒ సీతాపతిరావు, సికినం కాళిదాసు, పంతం గజేంద్ర, వేమూరి పూర్ణచంద్రరావు, గడ్డం రాజు, కైలాసపతి పాల్గొన్నారు.



## గన్నవరం నుంచి విమానాలు బయలుదేరు వేళలు



| న్యూఢిల్లీకి | సమయం | వారం |
|---|---|---|
| ఎయిరిండియా | 09.05 | ప్రతిరోజూ |
| ఎయిరిండియా | 17.20 | ప్రతిరోజూ |
| ఎయిరిండియా | 20.40 | ప్రతిరోజూ |
| **హైదరాబాద్‌కు** | | |
| స్పైస్‌జెట్ | 09.35 | ప్రతిరోజూ |
| ఎయిరిండియా | 13.20 | బుధవారం మాత్రమే |
| స్పైస్‌జెట్ | 14.40 | మంగళవారం మినహా |
| ఎయిరిండియా | 17.20 | ప్రతిరోజూ |
| స్పైస్‌జెట్ | 17.35 | ప్రతిరోజూ |
| ట్రూజెట్ | 21.55 | ప్రతిరోజూ |
| **బెంగళూరుకు** | | |
| స్పైస్‌జెట్ | 07.55 | మంగళవారం మినహా |
| స్పైస్‌జెట్ | 20.00 | ప్రతిరోజు |
| **చెన్నైకు** | | |
| ట్రూజెట్ | 07.55 | ప్రతిరోజూ |
| స్పైస్‌జెట్ | 16.10 | ప్రతిరోజూ |
| స్పైస్‌జెట్ | 14.00 | మంగళవారం మాత్రమే |
| స్పైస్‌జెట్ | 20.00 | ప్రతిరోజు(వయా బెంగుళూరు) |
| **తిరుపతికి** | | |
| ఎయరిండియా | 07.55 | బుధవారం మినహా |
| **విశాఖపట్నానికి** | | |
| ఎయిరిండియా | 10.55 | బుధవారం మినహా |
| ఎయిరిండియా | 15.35 | బుధవారం మాత్రమే |
| **వారణాసి(కాశీ)కి** | | |
| స్పైస్‌జెట్ | 14.40 | మంగళవారం మినహా |

# 6,7 తేదీల్లో యువ కెరటాలు : మంత్రి రవీంద్ర



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

**ప్రజాశక్తి - మచిలీపట్నం**

రాష్ట్రంలో ఎక్కడా నిర్వహించని విధంగా యువ కెరటాలను పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. గురువారం హిందూ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6,7 తేదీల్లో యువకెరటాలు 2018 కార్యక్రమాలు యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. పండుగలా ఈ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. నాలుగు సంవత్సరాలుగా యువ కెరటాలు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఏడాది హిందూ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యువతకు విద్య, వైజ్ఞానిక, సృజనాత్మకత వెలికితీసి వారికి స్ఫూర్తిని కలిగించే విధంగా పెద్దఎత్తున కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. బందరు యువత అందరినీ ఒకేచోట చేర్చి కనివినీ ఎరుగని రీతిలో యువతరం అభ్యున్నతికి, బందరు నవనిర్మాణానికి ఈ యువకెరటాలు నిర్వహిస్తున్నామన్నారు. జనవరి 6వ తేదీ పాఠశాలల విద్యార్థుల కోసం, 7వ తేదీ కళాశాలల విద్యార్థుల కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పాటలు, నృత్యాలు, చిత్రలేఖనం, క్విజ్, లఘునాటికలు, ఉత్తేజ ప్రసంగాలు, ప్రఖ్యాత కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 6వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభ కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్, ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు, సాంఘిక సంక్షేమశాఖామంత్రి నక్కా ఆనందబాబు, ప్యానల్ స్పీకర్ కొనకళ్ల నారాయణరావు పాల్గొంటారన్నారు. సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు, కెరియర్ గైడెన్స్ విడియాల చక్రవర్తి వారిచే విద్యార్థులు-నిర్బంధ విద్య అంశంలో ప్రసంగాలు ఉంటాయన్నారు. విద్యార్థులకు గ్రూప్ సోలో డ్యాన్స్‌ల్లో పోటీలు ఉంటాయన్నారు. 70 పాఠశాలల నుండి విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

7వ తేదీ జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ, ప్రముఖ మోటివేటర్ బి.ఆర్.షఫీ పాల్గొంటారన్నారు. సాయంత్రం 4 గంటల నుండి జరిగే కార్యక్రమాల్లో రవాణా శాఖామంత్రి అచ్చెన్నాయుడు, ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ పాల్గొంటారన్నారు. పాడుతాతీయగా, బోల్‌బేబి బోల్ కార్యక్రమం విన్నర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారని తెలిపారు. ప్రముఖ సినీనటులు కృష్ణ కుమార్తె మంజుల దర్శకత్వంలో నిర్మించిన మనసుకు నచ్చింది సినిమా ఆడియో రిలీజ్ ఈ వేదికపై జరగనుండటం శుభపరిణామమన్నారు. 30 కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు పెద్దఎత్తున వేదికలు, లేటెస్ట్ సౌండ్ సిస్టమ్, ఎల్ఇడి స్క్రీన్‌లు ఏర్పాటుచేస్తున్నామన్నారు. ఎగ్జిబిషన్ స్టాల్ ఉంటాయన్నారు. ఈ ఉత్సవాలను యువత అందరూ పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు మాట్లాడుతూ విద్య, వైజ్ఞానిక అంశాలపై యువతకు స్ఫూర్తినిచ్చే విధంగా ఇదొక చర్చావేదిక కాగలదని అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ మాట్లాడుతూ యువతలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. ఈ సమావేశంలో వైస్‌ఛైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, నారగాని ఆంజనేయప్రసాద్, గనిపిశెటి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రెవరెండ్ ఫాదర్ ఇన్నయ్య

## ఆదర్శనీయులు జోసఫ్ తంబి

**ప్రజాశక్తి-ఉంగుటూరు**

బ్రదర్ జోసఫ్ తంబి తన సేవా కార్యక్రమాలతో అందరికీ ఆదర్శంగా నిలిచారని జానంపేట విజ్ఞాన నిలయం ప్రెసిడెంట్ రెవరెండ్ ఫాదర్ ఇన్నయ్య పొలిశెట్టి అన్నారు. బ్రదర్ జోసఫ్ తంబి 73వ వర్థంతి మహోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పెదఅవుటపల్లి తంబి ఆలయ ప్రాంగణంలో పతాకావిష్కరణ చేసి గురువారం సాయంత్రం నవదిన జపాలు కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించి, దివ్యబలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తంబి చేసిన సువిశేష బోధనలు అందరినీ అకట్టుకునేవన్నారు. ఆయన గడిపిన సామాన్య జీవితం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఈకార్యక్రమంలో తంబి ఆశ్రమం రెక్టర్ రెవరెండ్ ఫాదర్ దేవదాసు దుగుట, ఫాదర్ ఇన్నబాబు పొలిమరశెట్టి, ఫాదర్ జోసఫ్ పాలడుగు,సంఘపెద్దలు,సంఘస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జవాబుదారీగా పాలన : మంత్రి

**మచిలీపట్నం :** తమ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పట్టణ పరిధిలోని 9,10,11,12,13 వార్డుల్లో గురువారం జరిగిన జన్మభూమి గ్రామసభల్లో ఆయన మాట్లాడారు. 9,12 వార్డుల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ అందరూ సంతోషంగా ఉంటే అదే అసలైన జన్మభూమి అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, జాయింట్ కలెక్టర్ కె.విజయ, ఆర్‌డిఓ జె.ఉదయభాస్కర్, మండల ప్రత్యేకాధికారి పి.వి.రమేష్‌కుమార్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పి.కాశీవిశ్వనాథం, కమిషనర్ ఎం.జస్వంతరావు, అసిస్టెంట్ కమిషనర్ చంద్రిక, కౌన్సిలర్లు గొసియాబేగం, లోగిశెట్టి వెంకటస్వామి, మొవ్వ పార్వతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ లే అవుట్లపై పలువురు ఉద్యోగుల సస్పెన్షన్

**పెడన :** పెడన పురపాలక సంఘం పరిధిలో అక్రమ లేఅవుట్లకు సంబంధించి ఇక్కడ పనిచేసిన పలువురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. 2015లో పెడన పురపాలక సంఘ పరిధిలో అక్రమ లేఅవుట్లపై వైసిపికి చెందిన ప్రస్తుత మున్సిపల్ ఛైర్మన్ బండారు ఆనందప్రసాద్, కౌన్సిలర్ కటకం ప్రసాద్ తదితరులు అక్రమ లేఅవుట్లకు సంబంధించి విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదుచేశారు. విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అప్పటి మున్సిపల్ కమిషనర్ బి.సంగీతరావు, మన్నం గోపాలరావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.వినోద్‌కుమార్, టిపిఎస్ గల్లా గోవిందకుమారి, టిపిబిఒ పడమట వెంకటేశ్వరరావు, టిపిఎస్ కె.హరిప్రసాద్‌లపై క్రైమ్ నెం.1241/వి అండ్ ఇ డి1/2015గా విజిలెన్స్ అధికారులు నమోదుచేశారు. అప్పటి నుంచి ఈ అక్రమ లేఅవుట్లపై విజిలెన్స్ అధికారులు విచారణ నిర్వహించారు. తనిఖీల్లో సర్వే ఆర్ఎస్ నెం.353, 28/11జి, 301/1, 2అండ్3 మరియు 479/6ఎ, ఆర్ఎస్ నెం.479/3,4,5, 482/1బి,3,4లో డెవలప్‌మెంట్ ఛార్జీలు 10 శాతం ఓపెన్ సర్వీస్ ఛార్జీలు మున్సిపాలిటీకి చెల్లించనట్లుగా విజిలెన్స్ నివేదిక రుజువైంది. దీంతో పై వారిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ప్రభుత్వం జారీచేసింది. అయితే టిపిఎస్ గల్లా గోవిందకుమారి పెడన పురపాలక సంఘంలో విధులు నిర్వహిస్తుండగా మిగతావారు వివిధ పట్టణాలకు బదిలీ అయ్యారు.

## డైరీ ఆవిష్కరణ

**గుడివాడ :** నందమూరి తారకరామారావు క్రీడాప్రాంగణం కమిటీ ఆధ్వర్యంలో ప్రచురించిన 2018నూతన సంవత్సర డైరీను రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆవిష్కరించారు. గురువారం జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని మంత్రి కార్యాలయంలో ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రగతే ధ్యేయం : వంశీ

**ప్రజాశక్తి-ఉంగుటూరు(హనుమాన్‌జంక్షన్)**

రాష్ట్ర ప్రగతే ధ్యేయంగా సిఎం చంద్రబాబు నిరంతర కృషి చేస్తున్నారని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడు మండలం కోడూరుపాడు, అంపాపురం, బండారుగూడెం, ఎ.సీతారామపురం గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు జరిగాయి. కోడూరుపాడు గ్రామసభలో ఆయన మాట్లాడారు. అనంతరం చంద్రన్న సంక్రాంతి కానుకలు, చంద్రన్న ఉపకారవేతనాలు, డ్వాక్రా మహిళలకు వడ్డీలేని



రుణాల చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే వంశీ

రుణాలు, కొత్త రేషన్ కార్డులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. తెలుగు ప్రభుత్వ పథకాలు, మరుగుదొడ్డి వినియోగం గురించి జరిగిన సందేశాత్మక చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రేమల్లె గ్రామానికి చెందిన తుమ్మల చంద్రశేఖర్‌కు రైతురథం పథకం కింద ట్రాక్టర్‌ను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి పి.సత్యనారాయణ,ఎంపిపి తుమ్మల కోమలి,ఎంపిడివో ఆర్.కేశవరెడ్డి,గ్రామసర్పంచ్ వేమూరి అగస్తియమ్మ,ఎంపిటిసి,పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.అంపాపురంలో జరిగిన గ్రామసభలో అధికారులు,సర్పంచ్ సంజయ్‌కుమార్,ఎంపిటిసి తదితరులు పాల్గొన్నారు.బండారుగూడెంలో జరిగిన గ్రామసభలో తహశీల్దారు కె.గోపాలకృష్ణ,సర్పంచ్ అబ్బూరి హేమలత,వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రజా సమస్యలు ప్రజలను అడిగి తెలుసుకున్నారు.ఎ.సీతారామపురంలో తహశీల్దారు కె.గోపాలకృష్ణ,సర్పంచ్ కె.శ్రీనివాసరావు,తదితరులు జన్మభూమి గ్రామసభల్లో పాల్గొన్నారు.

## కైకలూరు ఆసుపత్రి ఆదర్శంగా నిలవాలి : కామినేని

**ప్రజాశక్తి-కైకలూరు**

వైద్య సదుపాయాలు కల్పించడంలో కైకలూరు ఆసుపత్రి రాష్ట్రంలోనే ప్రథమంగా రూపుదిద్దుకుని ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య వైద్య విద్యా శాఖమంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం ఆయన నూతనంగా నిర్మిస్తున్న స్థానిక ఆసుపత్రిని ఆంధ్రప్రదేశ్ వైద్యసేవలు, మౌలిక సదుపాయాల సంస్థ ఎస్ఈ కె.శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మరో రెండు నెలల్లో నూతన భవనం పూర్తవుతుందని, అన్ని హంగులతో ప్రారంభం కానున్నదన్నారు. 50 పడకల ఆసుపత్రి ప్రజలకు అన్ని సదుపాయాలతో అందుబాటులో ఉంటుందన్నారు. రాష్ట్రంలో కొత్తగా నిర్మించే అన్ని పిహెచ్‌సీల కంటే కైకలూరు ఆసుపత్రి నూతన హంగులతో ఏర్పడి ఆదర్శంగా ఉండాలని ఆ విధంగా కాంట్రాక్టర్లు పని చేయాలని ఆదేశించారు. కొత్త ఆసుపత్రితో పాటు పాత భవనాన్ని రూ.1.15 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని, రెండిటిని మార్చి నెలలో ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మౌలిక సదుపాయల సంస్థ ఈఈ ప్రవీణ్‌రాజ్, జేఈ కిషోర్, డి.ఈ నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎఎంసీ ఛైర్మన్ సామర్ల శివకృష్ణ, ముదునూరి సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రాధాన్యత : మంత్రి

**కైకలూరు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సేవే ధ్యేయంగా పని చేస్తోందని, రైతు సంక్షేమమే లక్ష్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, వైద్య విద్యా శాఖ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని రామవరంలో నిర్వహించిన జన్మభూమి గ్రామ సభలో ఆయన మాట్లాడారు. రుణమాఫీలోనూ ఇచ్చిన హామీ ప్రకారం మూడో విడత నగదును బ్యాంక్ ఖాతాల్లోకి జమ చేశారన్నారు. డ్వాక్రా మహిళలకు రెండో విడత మూలధనం రూ.3 వేలు వారి ఖాతాల్లోకి వేశారన్నారు. రైతులను ఆదుకునేందుకు సిఎం చంద్రబాబు పట్టిసీమ ద్వారా నీరు అందించగలిగారని లేకుంటే తాగునీరు కూడా ఉండేది కాదన్నారు. రెండేళ్ళుగా కృష్ణాజలాలు లేవని, నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు నీరందని దృష్టితో ఏర్పడిందన్నారు వచ్చే ఏడాదికి పోలవరం పూర్తి చేసి రెండు పంటలకు తాగు,సాగునీరు అందిస్తామన్నారు. వరహాపట్నం-ఉప్పుటేరు ఆర్ అండ్ బి రహదారికి రూ.15 లక్షలు మరమ్మతులకు కేటాయించామన్నారు. 67 ఏళ్ళలో 550 ట్రాన్స్ ఫార్మర్లు ఉంటే ఈ మూడేళ్ళలో టీడీపీ ప్రభుత్వం 1100 ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు చేసిందని, నిరంతర విద్యుత్తును అందిస్తున్నామన్నారు. కాపు కార్పోరేషన్ ఛైర్మన్ చలమలశెట్టి రామానుజయ మట్లాడుతూ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఎస్సీ,ఎస్టీ బీసీ, ఓసీ కార్పోరేషన్‌లతో పాటు కాపు కార్పోరేషన్ ఏర్పాటు చేసి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఆర్థిక చేయూత ఇచ్చి వారి అభివృద్ధికి తోడ్పడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు మాట్లాడుతూ ప్రజలకు కావాల్సిన సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించిందని, ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటిసి బొమ్మన బోయిన విజయలక్ష్మి, ఎఎంసీ ఛైర్మన్ సామర్ల శివకృష్ణ, ప్రత్యేకాధికారి ఆనందబాబు, సర్పంచి జి. కుమారి, తహసీల్దారు శ్రీనునాయక్, ఎమ్పీడిఓ దివాకర్, డిఎస్పీ మహేష్, వివిధ శాఖలధికారులు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని రామవరం మంచినీటి చెరువుకు తాగునీరు నింపేందుకు కలిదిండి మండలం కొండూరు వద్ద పోల్‌రాజ్ కెనాల్ నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశారు. ఆర్‌డబ్ల్యుఎస్ నిధులు రూ. 38 లక్షలతో పైపులైన్ ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. దీనిని మంత్రి డా. కామినేని గురువారం ప్రారంభించారు. సంతృప్తి కరంగా సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఈ సిహెచ్ రామారావు, సర్పంచి జి.కుమారి పాల్గొన్నారు.

## మహాపాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

**గుడివాడ :** రాష్ట్రానికి జీవనాధారమైన పోలవరాన్ని పూర్తి చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు పిసిసి సభ్యులు గానుగుల వీరవేతాజీ, డిసిసి ఉపాధ్యక్షులు శిష్టా దత్తాత్రేయులు అన్నారు. గురువారం స్థానిక గాంధీ మండపంలో పోలవరం కోసం కాంగ్రెస్ మహాపాదయాత్ర గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గానుగుల, శిష్టా మాట్లాడుతూ ఈ నెల 7,8,9 తేదీల్లో ధవళేశ్వరం నుండి పోలవరం ప్రాజెక్టు వరకు మహాపాతయాత్రను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 10వ తేదీన పోలవరం వద్ద సత్యాగ్రహం చేపట్టామన్నారు.

ప్రజాశక్తి
విజయవాడ
శుక్రవారం 5 జనవరి 2018



# కీళ్ల నొప్పులతో అప్రమత్తం



## - నిరంతరం వ్యాయామం, బరువును అదుపు చేయడమే మేలు




### అలవాట్లు

పొగాకు, మద్యం మాదక ద్రవ్యాల వంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. ఆరోగ్యంగా జీవించాలంటే దినచర్యలో వ్యాయామం తప్పనిసరి. వ్యాయామం చాలా సులభతరమైన ఔషధం. నడక వల్ల కీళ్లకు ఎంతో మేలు చేస్తోంది. 30ఏళ్ల పైబడిన వారంతా వెస్ట్రన్ కమోడ్ వినియోగించడం మంచిది. తరుచుగా కింద కూర్చోవడం చేయకూడదు. ఎక్కువ సమయం నిలబడి ఉండకూడదు. స్థూలకాయం మంచిది కాదు.

ప్రజాశక్తి - నందిగామ

సాధారణంగా ఎక్కువమందికి నిత్యం నరకం చూపిస్తున్న ఆరోగ్య సమస్యలేవీ అని అడిగితే వెంటనే మనం గుండె జబ్బులనో, క్యాన్సర్లనో చెబుతాం. కానీ, నేటి ఆధునికయుగంలో మనిషిని పీడిస్తున్న అతి పెద్ద సమస్య కీళ్ల నొప్పులు. ప్రతిరోజూ ఉదయం వేలాది మంది తీవ్రమైన నొప్పితో బాధపడుతున్నారు. విపరీతమైన కీళ్ల నొప్పులతో నిద్ర లేస్తున్నారు. మోకీలు మన ఒంట్లో అతి క్లిష్టమైన కీలు. అన్ని కీళ్ల కన్నా పెద్దది మోకీలులో ఏ చిన్న సమస్య తలెత్తినా జీవితం కుంటుపడినట్టే అనిపిస్తుంది. ముఖ్యంగా కీళ్ల అరుగుదల, వాపులు(అర్థ్రైటిస్) మొదలైతే ఆ బాధ వర్ణానాతీతం. సమస్య తీవ్రమైతే అడుగు తీసి అడుగు వేయడమే గగనమైపోతోంది. ఈ నొప్పి శారీరకంగానే కాదు. మానసికంగా కూడా చికాకు. ఆందోళన వంటి ఇబ్బందులను తెచ్చి పెడుతుంది. విజయవాడ, గుంటూరు బోధనాసుపత్రుల్లోని ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స విభాగానికి వస్తున్న వారిలో 70శాతం మంది కీళ్లనొప్పులతో బాధపడే వారు ఉంటున్నట్లు గణాంకాలు సూచిస్తున్నాయి. ఈ నొప్పులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఎంతో అవసరం.

**ఫ్లోరైడ్ ఎక్కువైనా ఇబ్బందే..**

భూగర్భ జలాల్లో తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండడం వల్ల అవి తాగిన వారిలో ఎముకల్లో ఫ్లోరైడ్ ఎక్కువగా చేరి పోయి కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తున్నాయి. నందిగామ మండలం తక్కెళ్లపాడు గ్రామంలో ఫ్లోరైడ్ నీరు తాగి చాలా మంది కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. అదేవిధంగా లింగాలడు, జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి తదితర గ్రామాలతో నందిగామ పట్టణంలో పలు ప్రాంతాల్లో ప్రజలు మోకీళ్ళ నొప్పులతో బాధపడుతున్నారు. కండరాల పటుత్వానికి కూడా క్యాల్షియం అవసరం. ఇది తగ్గటం వల్ల నొప్పులు వస్తున్నాయి. అదేవిధంగా చికెన్ గున్యా, డెంగీ బారిన పడిన వారిలో కూడా ఇతరుల కంటే కీళ్ల నొప్పులు ముందుగానే వస్తున్నాయి. పశ్చిమకృష్ణాలో అత్యధిక శాతం మంది కీళ్ల నొప్పుల బారిన పడిన వారు ఉన్నారు.

**మోకీళ్ల అరుగుదల, వాపు సమస్యతో వచ్చే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కీళ్లు అరగటం వల్ల తలెత్తే మొదటి ఇబ్బంది నొప్పి. ముఖ్యంగా ఏదైనా పని చేసేటప్పుడు లేదా ఎక్కువసేపు కదలకుండా ఉన్నప్పుడు నొప్పి మరింత వేధిస్తుంది. మన మోకీలు ఎముకల చివర్లో మృదులాస్థి(కార్టిలేజ్) అనే సున్నితమైన ఎముక ఉంటుంది. ఎముకల మధ్య మినిస్కస్ అనే దళసరి వాషర్ లాంటి పొర కూడా ఉంటుంది. మృధులాస్తి, మినిస్కస్ పొరలు మన శరీర బరువును, కదలికలు, ఒత్తిడిని ఎప్పటికప్పుడు గ్రహిస్తూ కదలికలు సాఫీగా సాగేలా చూస్తాయి. వయస్సు మీద పడుతున్న కొద్ది మృదులాస్తి క్షీణించడం మొదలవుతుంది. క్రమేపి వాషర్ కూడా దెబ్బతింటుంది. దీంతో మోకీలు కదలినప్పుడు ఎముకలు రెండు ఒకదానికి మరొకటి రుద్దుకొని విపరీతమైన నొప్పికి దారి తీస్తుంది. ఇదే అర్థ్రైటీస్‌కు మూలం.**

### మార్పిడి ఒక్కటే మార్గం కాదు

**డాక్టర్ ముంద్ర నరసింహారావు,**



మోకీళ్లు అరిగి పోయి తీవ్రమైన నొప్పులతో బాధపడే వారికి మోకీలు మార్పిడి ఎంతగానో ఉపయోగపడుతుంది. కీళ్ల నొప్పులతో బాధపడే వారికి ముందుగా మోకీళ్లపై భారం పడేలా చేసే పనులు మెట్లు ఎక్కటం వంటివి చేయకూడదు. అధిక బరువులు తగ్గించుకోవటం, జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. కొన్ని ప్రత్యేక వ్యాయామాలు చేయాలి. తద్వారా కీళ్ల బిగుసుకోవటం తగ్గుతుంది. కదలికలను మెరుగుపరుస్తాయి. అందువల్ల ఫిజియోథెరపీ కూడా చేయించుకోవాలి.

**అదనపు బరువుతో మోకాళ్ల నొప్పులు**

అధిక బరువుతో మోకీళ్లు అరిగిపోతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. పలు అధ్యయనాల ద్వారా కూడా తెలుస్తోంది. బరువు పెరిగిన వారిలో మోకీలు బిగుసుపోవడం, పనితీరు తగ్గే ముప్పు ఎక్కువ. అందువల్ల మోకీలు సమస్యలను నివారించుకోవటానికి బరువు పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

**ఆహారపు అలవాట్లు :** క్యాల్షియం ఎముకల పటుత్వానికి కీలక పాత్ర పోషిస్తుంది. వయస్సు మీద పడుతున్న కొద్ది క్యాల్షియంతో నిండిన పదార్థాలను తగు మోతాదులో తీసుకోవాలి. ప్రధానంగా పాలు తాగాలి. విటమిన్లు, ఖనిజాలు కల్గిన పీచు పదార్థాలను తీసుకోవాలి. ఎండిన అంజీర, పండ్లు, నారింజ, బెండకాయ, బాదంపప్పు, చేపలు తీసుకోవాలి.

## టాటా వాహనాలకు ఆరేళ్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

అన్ని రకాల ట్రాక్టర్లు, ట్రయిలర్లు, మల్టీ యాక్సిల్ ట్రక్కులు, టిప్పర్లకు ఆరేళ్ల వారంటీ ఇస్తున్నట్లు టాటా మోటార్స్ కమర్షిల్ వెహికల్ హెడ్ గిరీష్ వాఘ్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తాము ఆరేళ్ల పాటు డ్రైవ్‌లైన్ వారంటీ ఇస్తున్నట్లు ఆయన వివరించారు. దేశంలోని 20 లక్షల ట్రక్కులు, టిప్పర్లకు ఈ వారంటీ వర్తిస్తుందన్నారు. దేశంలో ప్రతి 50 కిలోమీటర్లకు ఒక టచ్ పాయింటు ఉంటుందని, దాదాపు 1800 టచ్ పాయింట్లలో ఈ వారంటీ అందుబాటులో ఉంటుందని వాఘ్ తెలిపారు. టాటా వాహనాన్ని విక్రయిస్తే కండీషన్‌ను పరీక్షించి కొనుగోలుదారునికి వారంటీ ఇస్తామన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై నిలిచిన వాహనాలను 24 గంటల్లోనే డెలివరీ చేస్తామని పేర్కొన్నారు. కస్టమర్ కేర్ యాప్ ద్వారా సర్వీస్ బుకింగ్, నిర్వహణ టిప్స్, డీలర్ లొకేషన్, సర్వీసు హిస్టర్, ఎమర్జెన్సీ ఎస్ఓఎస్‌ను ఉపయోగించుకోవచ్చని వివరించారు. టాటా సురక్ష పథకం ద్వారా ఏడాది పాటు మరమ్మతులు అందుబాటులో ఉంటాయన్నారు. టాటా ఫ్లీట్‌మేన్ కింద వెహికల్ ట్రాకింగ్, జియో ఫెన్సింగ్, ట్రిప్ మేనేజ్‌మెంట్, ఇంధనం ఆదా, ఇంధన చోరీ నివారణ, డ్రైవింగ్ పర్యవేక్షణ తదితర అత్యాధునిక ఫీచర్లు ఉన్నాయని పేర్కొన్నారు. టాటా కవాచ్ కింద 15 రోజుల్లో మరమ్మతులు చేస్తారని తెలిపారు. అలా కాని పక్షంలో టిజిపి కూపన్‌లు అందజేమన్నారు. మొబైల్ సర్వీస్ వెహికల్ ద్వారా వాహనదారుడి ఇంటి ముంగిటే సేవలను అందజేస్తారని గిరీష్ వాఘ్ వివరించారు.

బిజినెస్ వాచ్

## నగరంలో ఎసిటి సేవలు విస్తరణ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ప్రముఖ ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ ఎసిటి తాజాగా అదనంగా సొమ్ము వసూలు చేయకుండానే తన సేవలను విస్తరించిందని సంస్థ ప్రతినిధి సూర్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 2వ తేదీ నుండి ఏడాది మొత్తం ఈ సేవలు అందుబాటులో ఉంటుందన్నారు. ఎపిలోని నాలుగు ప్రధాన నగరాల్లో ఎఫ్‌యూపి పరిమితిని, వేగాన్ని రెట్టింపు చేసినట్లు తెలిపారు. ఏలూరు, విజయవాడ, గుంటూరులో మంత్లీ ప్లాన్ ఎసిటి సిల్వర్‌లో 150 జిబి ఎఫ్‌యుపి పరిమితిని 250 జిబి ఎఫ్‌యుపికి, 20 ఎంబిపిఎస్ వేగాన్ని 30 ఎంబిపిఎస్‌కు పెంచినట్లు తెలిపారు. ఎసిటి గోల్డ్‌లో 250 జిబి ఎఫ్‌యూపి పరిమితిని 400 ఎఫ్‌యుపికి, 50 ఎంబిపిఎస్ వేగాన్ని 60 ఎంబిపిఎస్‌కు అప్‌గ్రేడ్ చేశామన్నారు. ఎసిటి డైమండ్‌లో 300 జిబి ఎఫ్‌యుపి పరిమితిని 600 ఎఫ్‌యుపికి, 75 ఎంబిపిఎస్ వేగాన్ని 100 ఎంబిపిఎస్‌కు పెంచినట్లు తెలియజేశారు. విజయవాడ, గుంటూరులో ఎసిటి ఎస్‌వోహెచ్‌వో లైటినింగ్‌లో 300 జిబి ఎఫ్‌యుపి పరిమితిని 800 జిబి ఎఫ్‌యుపికి, 40 ఎంబిపిఎస్ వేగాన్ని 100 ఎంబిపిఎస్‌కు పెంచినట్లు పేర్కొన్నారు.

## పుస్తక ప్రియుల పాదయాత్ర

### - పెద్ద సంఖ్యలో పాల్గొన్న పుస్తకాభిమానులు, విద్యార్థులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్యమైదాన్‌లో జరుగుతున్న పుస్తక మహోత్సవ్‌లో భాగంగా గురువారం సాయంత్రం పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహించారు. ఈకార్యక్రమం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్ నుండి స్వరాజ్యమైదాన్‌లోని పుస్తక మహోత్సవ్ వరకు జరిగింది. ఈకార్యక్రమంలో నగరానికి చెందిన పలువురు ప్రముఖులు, పుస్తకాభిమానులు, విద్యార్థులు, కళాశాల యవత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పుస్తక ప్రియుల పాదయాత్రను ప్రముఖ కవి యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, సీనియర్ పాత్రికేయులు ఎస్.వెంకట నారాయణ ప్రారంభించారు. ఈసందర్భంగాయార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం విద్యార్థి దశ నుండే అలవాటు చేసుకోవాలన్నారు. సబ్జెక్టు పుస్తకాలతో పాటు విజ్ఞాన వికాసాన్ని పెంపొందించే పుస్తకాలు కూడా చదవాల్సిన అవసరం ఎంతయినా ఉందన్నారు. పుస్తకాలపై అభిమానాన్ని పెంపొందించే విధంగా విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహించడం అబినందనీయమని తెలిపారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ గత కొన్ని సంవత్సరాల నుండి జనవరి మొదటి వారంలో పుస్తక మహోత్సవ్ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. అంతేకాకుండా పుస్తకాలపై యువతకు ఆసక్తి కలిగించే విధంగా పుస్తక ప్రియుల పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈకార్యక్రమంలో నగరంలోని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.





పుస్తక ప్రియుల పాదయాత్రలో పాల్గొన్న యార్లగడ్డ, ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్,


పుస్తక ప్రియుల పాదయాత్రలో వివిధ కవుల వేషధారణలో విద్యార్థులు


సివి సాహిత్యవేదికపై పుస్తకావిష్కరణలో పాల్గొన్న శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్

## చాణక్య తంత్ర పుస్తకం... ప్రతి ఒక్కరికీ ఉపయోగం

### కృష్ణాజిల్లా పూర్వ కలెక్టర్ ప్రభాకరెడ్డి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ రచించిన 'చాణక్య తంత్ర' పుస్తకం ప్రతి ఒక్కరికీ ఉపయోగపడే విధంగా ఉందని జిల్లా మాజీ కలెక్టర్ ప్రభాకరెడ్డి అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్య మైదాన్‌లో జరుగుతున్న 29వ పుస్తక మహోత్సంలో పట్టాభిరామ్ రచించిన చాణక్య తంత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం జరిగింది. ఈపుస్తకాన్ని ఆవిష్కరించిన ప్రభాకరెడ్డి మాట్లాడుతూ 12 సంవత్సరాలుగా డాక్టర్ పట్టాభిరామ్ ఎన్నో పుస్తకాలు రచించారన్నారు. ఆయన రచనల ద్వారా ఎంతో మంది ఉత్తేజితులయ్యారని, ఎంతో మంది ఉన్నత రంగాలకు వెళ్లారన్నారు. ఇప్పటివరకు యువతకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా అనేక రచనలు చేసిన ఆయన మొదటిసారిగా సమాజంలోని ప్రతిఒక్కరికీ ఉపయోగపడే విధంగా చాణక్యతంత్ర పుస్తకరం రచించారని ఈసందర్భంగా పట్టాభిరామ్‌ను అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన ఎమెస్కో బుక్ సెంటర్ అధినేత విజయకుమార్ మాట్లాడుతూ సమాజంలో వ్యక్తి పరిపూర్ణత సాధించాలంటే సమాజపు మూల తాత్వికధోరణులను అర్థం చేసుకోవాలన్నారు. గతేడాది గాంధీజీ ఆత్మకథ సత్యాన్వేషణ ఆధారంగా డాక్టర్ బి.వి.పట్టాభిరామ్ మేజిక్ ఆఫ్ మహాత్మా అనే గ్రంథాన్ని రచించారన్నారు. ప్రపంచ సమాజ నిర్మాణంలో చాణక్యుని అర్థశాస్త్రం నిర్వహించిన పాత్ర ఎంత ముఖ్యమైనదో చెప్పడానికి అనేక ప్రపంచ భాషల్లోకి ఆగ్రంథం అనువదించబడటమే నిదర్శనమన్నారు. రాజులు, రాజ్యాలు పోయినా మన చుట్టూ కొత్త వ్యవస్థలు ఏర్పడుతున్నాయన్నారు. ఆ వ్యవస్థలకు చాణక్యుని సూత్రాలు అన్వయింప చేస్తూ ఈగ్రంథరచనను పట్టాభిరామ్ చేశారన్నారు. వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ బి.వి. పట్టాభిరామ్ మాట్లాడుతూ పుస్తకంలో తాను వివరించిన తంత్రాలు, చాణక్యుని రచనల్లో కొన్ని మాత్రమేనన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరికీ పనికి వచ్చేవి తీసుకున్నారన్నారు. మహామహోపాధ్యాయ ఆచార్య పుల్లెల శ్రీరామ చంద్రుడు వ్యాఖ్యాన గ్రంథంలోని శ్లోకాలను తీసుకున్నట్లు తెలిపారు. చాణక్యనీతి, అర్థశాస్త్రం పుస్తకాలు చదువుతుంటే ఇవి వ్యక్తిత్వ వికాసానికి, శిఖర నైపుణ్యాలు పెంపొందించుకోవాడానికి, ఎమోషన్లకు సరైన రీతిలో ప్రదర్శించడానికి దోహదపడే గ్రంథాలన్నారు. ఇలాంటి గ్రంథాలను రాయాలని ప్రోత్సహించిన ఎమెస్కోబుక్ హౌస్ అధినేత దూపాటి విజయకుమార్‌కు అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో టుబాకో బోర్డు సెక్రటరీ శ్రీధర్, పలువురు పుస్తకాభిమానులు పాల్గొన్నారు.

### పుస్తక మహోత్సంలో నేడు...

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విజయవాడ బుక్‌ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్య మైదాన్‌లోని పుస్తక మహోత్సవ్ ప్రాంగణంలో శుక్రవారం జరిగే కార్యక్రమాలు

- మధ్యాహ్నం 3 గంటలకు సి.వి. సాహిత్య వేదికపై " కథ " అనే అంశంపై సదస్సు.
- సాయంత్రం 6 గంటలకు సి.వి. సాహిత్య వేదికపై ' రసాయన మూలకాల రహస్యాలు, కుప్పిలి పద్మ కథలు ' పుస్తకాలు ఆవిష్కరణ.
- రాత్రి 7 గంటలకు సాహితీ మిత్రులు విజయవాడ వారి ఆధ్వర్యంలో ' ఇంటిపేరు ఇంద్రగంటి ' పుస్తకావిష్కరణ
- రాత్రి 8 గంటలకు సి.వి. సాహిత్య వేదికపై మల్లెతీగ వారి ' లాకర్ నెంబర్ 369 ' పుస్తకావిష్కరణ
- సాయంత్రం 6 గంటలకు పుస్తక మహోత్సవ్ ప్రాంగణంలోని అబ్దుల్ కలామ్ ప్రతిభా వేదికపై క్విజ్ పోటీలు


చాణక్య తంత్ర పుస్తకావిష్కరణలో ప్రభాకరరెడ్డి, ఐఎఎస్ అధికారి శ్రీధర్‌బాబు

## నాల్గోరోజూ ఉత్సాహంగా పుస్తక సంబరాలు


పుస్తక ప్రియుల పాదయాత్రను ప్రారంభిస్తున్న సీనియర్ పాత్రికేయులు వెంకటనారాయణ, తదితరులు


మాట్లాడుతున్న వ్యక్తిత్వ వికాస నిపుణులు బివి.పట్టాభిరామ్

## గ్రంథ పఠనంతోనే వికాసం

### ప్రముఖ పాత్రికేయులు ఎస్.వెంకటనారాయణ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

గ్రంథ పఠనం ద్వారానే వికాసం, వివేకం కలుగుతాయనీ, పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని ప్రముఖ పాత్రికేయులు ఎస్.వెంకటనారాయణ అన్నారు. స్వరాజ్య మైదానంలో విజయవాడలో ఏర్పాటుచేసిన 29వ పుసక సంబరాల కార్యక్రమంలో సి.వి.సాహిత్య వేదికపై గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రయంలో ముఖ్యఅతిథిగా హజరైన ఆయన మాట్లాడారు. శ్రీశ్రీ రాసిన మహాప్రస్థానం సంవత్సరానికి లక్ష కాపీలు అమ్ముడయ్యాయంటే ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఏటేటా 300 పుస్తకాలు ప్రచరించడం ద్వారా తెలుగు భాషకు విశాలాంధ్ర ఎనలేని సేవలందిస్తోందన్నారు. పుస్తకాలు చదవటాన్ని పిల్లలకు అలవాటుగా మారేలా పెద్దలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇంటర్నెట్ సోషల్ మీడియాలో దూసుకుపోతున్న ఈ కాలంలో ప్రచురణకర్తలు ఎంతో సాహసంతో కొత్త పుస్తకాలు వెలుగులోకి తీసుకురావటం అభినందించదగిన విషయమన్నారు. తెలుగు గ్రంథాల ప్రచురణలో విశాలాంధ్ర బుక్‌హౌస్ చాలా పెద్దదన్నారు. సభకు అధ్యక్షత వహించిన శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ పుస్తక ప్రదర్శనలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సాంస్కృతికశాఖ ద్వారా రూ.50 లక్షలను ఇచ్చి ప్రోత్సహించిందన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో ఈ ప్రదర్శనలు ఏర్పాటు అలోచిస్తున్నామన్నారు. గత సంవత్సరం నుంచి పుస్తక వైపు ప్రజలను మళ్లించటానికి ఎన్టీఆర్ ట్రస్ట్ ముందుకు వచ్చి వారి సహాయ సహకారాలను అందిచటం అభినందించదగ్గ విషయమన్నారు. రకరకాల గ్రంథాలు చదవటం ద్వారానే మంచి వ్యక్తిత్వం, మేధస్సు వస్తాయన్నారు. ప్రతి సంవత్సరం మంచి గ్రంథాలు ముద్రితమవుతున్నాయన్నారు. అనువాత గ్రంథాలు వస్తున్నాయని ఇది శుభపరిణామమన్నారు. ఆంధ్రజ్యోతి పత్రిక సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తకానికి పర్యాయపదం విజయవాడ అని అన్నారు. భాషా, సాహిత్యాబివృద్ధికి ఉభయ తెలుగు రాష్ట్రాలు కృషి చేయాలన్నారు. భాషా, సాహిత్యాభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాహిత్య వేత్త పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ భాషా, సంస్కృతికి విశేష కృషి చేసినవారు మాత్రమే చరిత్రలో నిలిచివుంటారన్నారు. పాఠశాలలు, కళాశాలల విద్యార్థులను పుస్తక మహోత్సవాలకు తప్పక తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త శ్రీనివాసులు, ఎన్టీఆర్ ట్రస్ట్ సభ్యులు పెద్ది రామారావు, ఎమ్మెస్కో అధినేత విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులందరూ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని ఆర్థిక ఇబ్బందులను తొలగించుకోవాలని జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఐదో విడత జన్మభూమి సభ గురువారం 29వ డివిజన్‌లోని విద్యాధరపురం లేబర్ కాలనీలో గల ఉప్పలపాటి రామచంద్రరాజు నగరపాలక సంస్థ పాఠశాల ఆవరణలో జరిగింది.







పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీకాంతం

## ఫిబ్రవరి 4న పెలికాన్ పక్షుల పండుగ

### పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

పిబ్రవరి 4న నిర్వహించనున్న పెలికాన్ పక్షల పండుగను అట్టహాసంగా చేపట్టడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తెలిపారు. గురువారం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో కైకలూరు మండలంలోని ఆటపాక పెలికాన్ పక్షల పండగకు సంబంధించిన పోస్టర్లను పర్యాటకశాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మల్లికార్జునరావుతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా చేపట్టే ఈ పండుగను ప్రముఖ సినీనటులు, సెలబ్రిటీలు పాల్గొంటారని, ప్రకృతి ప్రేమికులందరు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాలని కలెక్టర్ తెలిపారు.

## మైనార్టీ కవిత్వ పుస్తకావిష్కరణను అడ్డుకోవటం దారుణం : రఘు

**ప్రజాశక్తి - మచిలీపట్నం**

మైనార్టీ కవిత్వ పుస్తకావిష్కరణను అడ్డుకోవడం తెలుగుదేశం వారికి తగదని దీనిని సిపిఎం తూర్పుకృష్ణా కార్యదర్శి ఆర్.రఘు ఖండించారు. విజయవాడ స్వరాజ్య మైదానంలో ఏర్పాటుచేసిన పుస్తక మహోత్సవంలో మైనార్టీ రచయితలు రాసిన కవితల పుస్తకావిష్కరణను అడ్డుకున్న తెలుగుదేశం వారి నిరంకుశ పోకడలు దారుణమని పేర్కొన్నారు. ఈ పుస్తక మహోత్సవంలో 35 మంది మైనార్టీ రచయితల కవితల సంపుటి 'మొఖామి' పుస్తక మహోత్స వంలో పుస్తకావిష్కరణ చేయడానికి వచ్చిన ప్రముఖ సాహితీవేత్త స్కైబాబాను అడ్డుకొని పుస్తకావిష్కరణ రద్దు చేయడం దుర్మార్గమైన చర్యగా పేర్కొన్నారు. ముస్లిం మైనార్టీల పట్ల తెలుగుదేశం పార్టీ వైఖరి ఇలాంటి చర్యతో తేటతెల్లమైందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ బిజెపితో జతకట్టి మతసామరస్యం కాపాడటంలో విఫలమైందన్నారు. రాజమండ్రిలో బహుజాన్ హత్య తీవ్రమైందన్నారు. పుస్తక మహోత్సవంలో ఎవరైనా తమ రచనలను ఆవిష్కరించుకోవచ్చన్నారు. అలాంటిది దీన్ని అడ్డుకోవడం ప్రాంతీయ సమానత్వానికి, లౌకితత్వానికి మచ్చగా పేర్కొన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడాల్సి ఉండగా తెలుగుదేశం పార్టీ వారు నిరంకుశ పోకడలకు పోయి అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు చేశారు.

## 'అంతర్ విశ్వవిద్యాలయాల క్రికెట్ పోటీలకు సారధి విద్యార్థి ఎంపిక

**నూజివీడు:** ఈ నెల 3వ తేదీనుంచి ఆంధ్రా యూనివర్సిటీలో జరిగే అంతర్ విశ్వ విద్యాలయాల క్రికెట్ పోటీలో జెఎన్‌టియుకె కాకినాడ క్రికెట్ జట్టుకు శ్రీసారధి ఇంజనీరింగ్ ఇనిస్టి ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నా లజీ ఎంబిఎ విద్యార్థి బెజవాడ లక్ష్మీకాంత్ ఎన్నికైనట్లు కళాశాల ప్రిన్సి పాల్ సూరనేని శ్రీధర్ గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. జట్టులో స్థానం సాధించిన లక్ష్మీకాంత్‌ను పిడి గద్దల బాబూరావులు, ప్రిన్సి పాల్‌తో పాటు ఏఓ రామచంద్రరావు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవాలి

## జన్మభూమిలో మంత్రి ఉమా

**ప్రజాశక్తి- భవానీపురం**

అర్హులందరూ సంక్షేమ పథకాలను అందిపుచ్చుకుని ఆర్థిక ఇబ్బందులను తొలగించుకోవాలని జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఐదో విడత జన్మభూమి సభ గురువారం 29వ డివిజన్‌లోని విద్యాధరపురం లేబర్ కాలనీలో గల ఉప్పలపాటి రామచంద్రరాజు నగరపాలక సంస్థ పాఠశాల ఆవరణలో జరిగింది. స్థానిక కార్పొరేటర్ బట్టిపాటి సంధ్యారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, మంత్రి దేవినేని ఉమా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జన్మభూమి నోడల్ అధికారి, ఇఇ కోటేశ్వరరావు ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంత్రి దేవినేని మాట్లాడుతూ 30 యేళ్ల చరిత్రలో గట్టువెనుక వాసుల ట్రాఫిక్ కష్టాలను తొలగింపుకు ఏ పార్టీ ముందుకు రాలేదని, టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత దుర్గా ఫ్లైఓవర్ నిర్మాణం చేపట్టామని, త్వరలో పూర్తిచేసి ఇబ్బందులు తొలగిస్తామన్నారు. ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలోని హెచ్.బీ.కాలనీ, బ్రహ్మయ్య కాలనీ, రాజుల బజార్, ఊర్మిళానగర్ తదితర ప్రాంతాలలో రోడ్లు, సైడు కాలువలు అభివృద్ధి చేసినట్లు చెప్పారు. కొంత ప్రాంత వాసుల ఇళ్ళ పట్టాలు సర్వే చేస్తున్నామని, త్వరలో రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించి ఆదుకుంటామని చెప్పారు. కార్పొరేటర్ బట్టిపాటి సంధ్యారాణి మాట్లాడుతూ జన్మభూమిలో తమ డివిజన్‌కు 157 రేషన్ కార్డులు వచ్చే విధంగా కృషి చేసినట్లు చెప్పారు.

**ఎమ్మెల్యేను చుట్టుముట్టిన మహిళలు :**

జన్మభూమికి వచ్చిన కొంతమంది మహిళలు గత జన్మభూమిలో కార్డులు, పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నామని, ఈ జన్మభూమిలో కూడా పింఛన్లు, కార్డులు రాలేదంటూ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్‌ను మహిళలు నిలదీశారు. ఏడాదికోసారి నిర్వహించే జన్మభూమిలో పేదలకు న్యాయం జరగడంలేదని కబేళాలోని రాము, క్వారీ సెంటర్ కొండ ప్రాంత నివాసి సలుగు పార్వతి ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో సంబంధిత శాఖల అధికారులను పిలిచి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ గోగుల వెంకటరమణరావు, 28వ డివిజన్ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షేక్ ఖాజా, టిడిపి అధికార ప్రతినిధి వేమూరి మల్లికార్జునరావు, నాయకులు బెనర్జీ, కోవి మహేంద్ర, 29వ డివిజన్ టి.డి.పి. అధ్యక్షులు మైలవరపు కృష్ణ, ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.



జన్మభూమి సభలో మాట్లాడుతున్న మంత్రి దేవినేని ఉమా



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సోషల్ వర్కర్ రాము

**ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని ఎమ్మెల్యేకు వినతి**

సర్వ హక్కులతో కొండ ప్రాంత ప్రజలకు కొత్త ఇళ్ళ పట్టాలు ఇవ్వాలని జన్మభూమి సభలో ఎమ్మెల్యే జలీల్‌ఖాన్‌కు స్థానిక సోషల్ వర్కర్, రాము క్వారీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.రాము వినపతిప్రతం అందజేశారు. రిజిస్ట్రేషన్ సౌకర్యం లేకపోవడంతో ఇళ్ళు నిర్మించుకున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. నివాసితుల ఇళ్ళు రిజిస్ట్రేషన్ చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**కళ్యాణ మండపం పూర్తిచేయాలని : సిపిఐ**

ఊర్మిళానగర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన విఎంసి కళ్యాణ మండపం, పార్కును త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యేకు డివిజన్ సిపిఐ కార్యదర్శి మాగం ఆత్మారాం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో గురజాల కొండలరావు, సిద్ధయ్య, జానీ తదితరులు వున్నారు.

**నాల్గో జన్మభూమిలో సమస్యలు తీర్చలేదు : వైసిపి**

29వ డివిజన్‌లోని సమస్యలపై నాల్గో విడత జరిగిన జన్మభూమిలో వినతిపత్రం అందించినా నేటికి కూడా అభివృద్ధికి నోచుకోకపోవటం దారుణమని వైసిపి నాయకుడు చిమటా గోపీ అన్నారు. డివిజన్‌లో సమస్యలపై మరోసారి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించినట్లు చెప్పారు.

# కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు : సిఐ

**ప్రజాశక్తి - భవానీపురం**

భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలలో కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సిఐ కాగిత శ్రీనివాసరావు తెలిపారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో సిటీ, రూరల్ గ్రామాలలో కోడిపందేలు నిర్వహించకూడదని హైకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు మండల స్థాయి అధికారుల బృందం గురువారం గొల్లపూడిలోని సూరాయిపాలెం గ్రామంలోని పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్థానికులకు కోడిపందేలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామాలలో డబ్బులతో కోడి పందేలు నిర్వహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కోడి పందేలు నిర్వహిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కోడి పందేలు జరక్కుండా పర్యవేక్షించేందుకు ఎస్ఐ స్వామి, మరో ఇద్దరు కానిస్టేబుళ్ళను నియమించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.



సూరాయిపాలెంలో తనికీలు చేస్తున్న సిఐ శ్రీనివాసరావు

# మ్యాన్‌హోల్స్‌తో భద్రం

**ప్రజాశక్తి - భవానీపురం**

స్థానిక భవానీపురంలోని ఓ రోడ్డులో మ్యాన్‌హోల్ మూత ప్రమాదాన్ని తలపిస్తోంది. రోడ్డుకు సమానంగా కాకుండా మ్యాన్‌హోల్ మూత లోపలకు దిగిపోయి ఉంది. భవానీపురం 28వ డివిజన్ రైతు బజార్‌కు వెళ్లే మార్గంలో స్థానిక కార్పొరేటర్ యేదుపాటి రామయ్య నివాసముండే రోడ్డులో మ్యాన్‌హోల్ మూత ఒక వైపుకు చొచ్చుకుపోయింది. దీంతో అటుగా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల భారిన పడుతున్నారు. చాలాకాలంగా మ్యాన్‌హోల్‌పై ఉంచిన సిమెంట్ మూతలు ప్రమాదభరితంగా ఉన్నప్పటికీ వాటిని సరిగా అమర్చకపోవటంపై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రమాదభరితంగా ఉన్న మ్యాన్‌హోల్‌ను గుర్తించి వాటి మూతలను సరిచేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



కార్పొరేటర్ రోడ్డులోని మ్యాన్‌హోల్ దుస్థితి

## జిల్లా వార్తలు

### ముగిసిన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలు

**ప్రజాశక్తి-మైలవరం**

స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా మైదానంలో గత మూడ్రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి సీనియర్ అంతర జిల్లాల ఫుట్‌బాల్ పోటీలు గురువారంతో ముగిశాయి. చివర్రోజు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఫైనల్‌లో కృష్ణా, నెల్లూరు జిల్లాల జట్లు తలబడగా నెల్లూరు జట్టు విజేతగా నిల్చింది. మూడవ స్థా నంలో చిత్తూరు, తూర్పుగోదావరి జిల్లాలు కైవసం చేసుకున్నాయి. పోటీలు అనంతరం బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ లకిరెడ్డి బాలిరెడ్డి, తిమ్మారెడ్డి, ఎపిఎఫ్ఎ ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, సీనియర్ ఉపాధ్యక్షులు సుధాకర్ తదితరులు హాజరయ్యారు. రాష్ట్ర నలుమూలల నుండి పది జట్లు పోటీలలో తలబడగా నెల్లూరు జిల్లా అత్యంత ప్రతిభ కనబర్చి విన్నర్‌గా నిలిచినందుకు క్రీడాకారులను బాలిరెడ్డి అభినందించారు. ఈపోటీలకు సహ కరించిన వారికి అభినందనలు తెలిపారు. రెండవ స్థానంలో నిలిచ్చిన కృష్ణా జిల్లా జట్టును కూడా బాలి రెడ్డి అభినందించారు. నెల్లూరు తరుపున రెండు గోల్స్ సాధించిన సుధాకర్‌ను ప్రత్యే కంగా అభినందిం చారు. కృష్ణా జిల్లా జట్టుపై నెల్లూరు జిల్లా జట్టు 3-1 గోల్ తేడాతో విజయం సాధించింది. గెలు పొందిన క్రీడాకారులకు మెమోంటోతో పాటు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ శాప్ డి ఎస్‌డిఓ, జిల్లా అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఈ నెల 7వ తేదిన నిర్వహించే 5, 10, 21 కిలోమీటర్ల రన్‌ను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో పోలీస్, మెడికల్ సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు.

# సిపిఎస్ రద్దు చేయకపోతే ఆందోళన తప్పదు

## పెన్షన్ సాధన సమితి కన్వీనర్ విద్యాసాగర్



మాట్లాడుతున్న విద్యాసాగర్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానం సిపిఎస్‌ను రద్దు చేసి ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించే వరకు ఉద్యోగులు ఐక్యపోరాట బాటను పట్టేందుకు సిద్దంగా వున్నారని ఎపి ఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు మరియు పెన్షన్ సాధన సమితి కన్వీనర్ ఎ.విద్యాసాగర్ తెలిపారు. సిపియస్ విధానం రద్దు కోసం ఏర్పడిన పెన్షన్ సాధన సమితి జిల్లా కమిటీ కన్వీనర్‌గా ఎ.విద్యాసాగర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం విజయవాడ గాంధీనగర్‌లోని ఎపి ఎన్‌జీవో హెూం నందు నిర్వహించిన పెన్షన్ సాధన సమితి తొలి సమావేశంలో కన్వీనర్ విద్యాసాగర్ మాట్లాడుతూ సిపిఎస్ విధానం అమలు చేయడం వల్ల రాష్ట్రంలో ఒక లక్ష 66 వేల మంది ఉద్యోగుల భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారయిందన్నారు. బ్రిటిషు కాలం నాటి నుండి పెన్షన్ యాక్ట్ 1871 అమలులో వుందని ఉద్యోగులకు ఇది ఒక సామాన్యబాధ్యతగల సౌకర్యంగా అమలులో వుందన్నారు. 1952 డిఫైన్డ్ బెనిఫిట్ పెన్షన్ నుండి ట్రిపుల్ బెనిఫిట్ పెన్షన్ స్కీములను సాధించుకోవాడానికి ఉద్యోగులు అనేక కష్టాలను ఎదుర్కొన్నామన్నారు. ఆ తరువాత కాలంలో ఉద్యోగి చనిపోయిన తరువాత కూడా అతని కుటుంబానికి పెన్షన్ కల్పించే సౌకర్యాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. అయితే 2004 జనవరి నుండి నూతన పెన్షన్ సిపియస్ విధానాన్ని తెరపైకి తీసుకురావడం జరిగిందన్నారు. ఆర్థిక సంస్కరణలు అమలులో భాగంగా ప్రవేశపెట్టిన సిపిఎస్ పథకం అమలులోకి వచ్చి దాదాపు 13 సంవత్సరాలు పూర్తయిందన్నారు. సిపియస్ విధానాన్ని రద్దు చేయాలని ఈ నెల 9వ తేదిన తాలూకా కేంద్రాలలో నిర్వహించే మహాధర్నా కార్యక్రమాలను విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఫిబ్రవరి 10న జిల్లా కేంద్రాలలో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించడం, అదే నెలలో ప్రజాప్రతినిధులు, ఆర్థికవేత్తలు, ట్రేడ్‌యూనియన్ సంఘాల ప్రతినిధులతో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

పెన్షన్ సాధన కమిటీ జిల్లా కన్వీనర్‌గా జెఎసి అధ్యక్షులు ఎ.విద్యాసాగర్, కార్యవర్గ సభ్యులుగా ఎ.పి.యూ.టి.ఎఫ్‌కు చెందిన ఎస్పీ మనోహర్‌కుమార్, పి.ఆర్.టి.యూకి చెందిన డి.శ్రీనివాస్, ఎన్.జి.వో కార్యదర్శి ఎం.డీ ఇక్బాల్, ఎ.పి.టి.ఎఫ్‌కు చెందిన టి.పూర్ణచంద్రరావు, ఎస్.టి.యూ.ఎ.పి కి చెందిన నాగరామారావు, సి.పి.యస్ ఉద్యోగుల సంఘానికి చెందిన బి.లంకేష్, ఎం.శ్రీనివాస్ లు ఎన్నికయ్యారు.



యూనిట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

## అన్‌సైట్ కంపోస్టు యూనిట్ పరిశీలన

**ప్రజాశక్తి - విజయవాడ**

తడి చెత్తను కంపోస్ట్ చేసే అన్‌సైట్ కంపోస్టు యూనిట్ పని తీరును నగర కమిషనర్ జె నివాస్ పరిశీలించి, సంబంధిత అధికారుల వద్ద నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నగరంలోని ఆయా ప్రాంతాలు, వివిధ మార్కెట్‌లలో అన్‌సైట్ కంపోస్టు కోసం ఏర్పాటు చేసిన యంత్రాలు, అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పని తీరును గురువారం పరిశీలించిన కమిషనర్, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి రోజు పరిసరాల నుంచి సేకరించిన తడి చెత్త నంతటిని షెడింగ్ చేసి పిట్‌లలో వేసి బయోకమ్ మిక్సర్ చేయు ప్రక్రియ నిరంతరం కొనసాగించునట్లుగా చూడాలని, యూనిట్ పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్వరాజ్యమైదానం, సింగ్‌నగర్, కాళేశ్వరరావు మార్కెట్ తదితర ప్రాంతాల్లో ఉత్పత్తి అవుతున్న తడి చెత్తను అక్కడికక్కడే అన్‌సైట్ కంపోస్టు కోసం ఏర్పాటు చేసిన మిషన్‌ల పనితీరును పరిశీలించిన సందర్భంలో కేదారేశ్వరపేట, పటమట ప్రాంతాల్లోని రైతు బజార్‌లలో మిషనరీ ఉన్నప్పటికీ వినియోగంలోకి రాసుకురాకపోవుట గమనించి అధికారులను కమిషనర్ వివరణ కోరారు. వెంటనే సదరు మిషనరీలను ప్రారంభించి షెడింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ఎపిఐఐసి కాలనీలో అన్‌సైట్ కంపోస్టు యూనిట్ పని తీరును పరిశీలించిన సందర్భంలో అక్కడ నూతనంగా కొబ్బరి బోండాల కటింగ్ కోసం ఏర్పాటు చేసిన యంత్రాలను కమిషనర్ పరిశీలించారు. దానిని కూడా వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎఎస్ఎన్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్ బంగారురాజు తదితరులు పాల్గొన్నారు.

# 7న 5కె రన్ : కలెక్టర్

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

ఈ నెల 7వ తేదిన నిర్వహించే 5, 10, 21 కిలోమీటర్ల రన్‌ను విజయవంతంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తెలిపారు. గురువారం సాయంత్రం కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో పోలీస్, మెడికల్ సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనవరి 7వ తేదిన ఉదయం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి ప్రారంభమయ్యే ఈ రన్నింగ్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొంటారని, వీటికి కావలసిన అన్ని ఏర్పాట్లు చేస్తూన్నట్లు తెలిపారు. 5,10,21 కె రన్‌లలో ఔత్సాహికులైన క్రీడాకారులతో పాటు స్కూల్, కాలేజి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొంటారన్నారు. పరుగుపందెంలో పాల్గొనే వారికి అవసరమైన వైద్య చికిత్సలు అందించడానికి స్టేడియం వద్ద ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. అదే విధంగా చక్కటి పారిశుద్ధ్యం, త్రాగునీరు అందించే విధంగా నగర పాలక సంస్థ ఏర్పాట్లు చేస్తుందని కలెక్టర్ తెలిపారు.

ఈ సమావేశంలో డి.సి.పిలు టి.కె.రాణా, జి.భూపాల్, టి.వి.నాగరాజు, ఎ.సి.పీలు సత్యానందం, కె.శ్రీనివాసరావు, ఎం.రమేష్, డి.శ్రావణ్‌కుమార్, టి.మురళీకృష్ణ, జి.రామకృష్ణలు, ఆర్డీవో ఎస్ హరీష్‌లతో పాటు నిర్వాహకులు పాల్గొన్నారు.

**కోస్టల్ సెక్యూరిటీలో జాగ్రత్తలు తీసుకోవాలి**

కోస్టల్ సెక్యూరిటిలో భాగంగా తీసుకోవలసిన అన్ని జాగ్రత్తలను తీసుకునే విధంగా కోస్టల్ సెక్యూరిటి డిస్ట్రిక్ లెవల్ కమిటి పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం అన్నారు. గురువారం రాత్రి జిల్లా కలెక్టర్ తన క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన కోస్టల్ సెక్యూరిటి డిస్ట్రిక్ట్ లెవల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సెక్యూరిటీ పరంగా తీసుకోవలసిన సంబంధిత శాఖలు సెక్యూరిటీ అధికారులకు పూర్తి సహాకారం అందించాలన్నారు. డిస్ట్రిక్ట్ లెవల్ కోస్టల్ సెక్యూరిటీ కమిటీలో జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గాను, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, కస్టమ్స్, ఇంటిలిజెన్స్ బ్యూరో, ఇండియన్ కోస్ట్‌గార్డ్, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్, పోర్టు ఆఫీసర్ ,పోర్టు ట్రస్ట్ మెంబర్లుగా, కోస్టల్ సెక్యూరిటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కన్వీనర్‌గా ఉంటారు. ఈ కమిటీ సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయిలో భద్రతాపరమైన అంశాలను సమీక్షిస్తారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీకాంతం

# ప్రజా సమస్యల పరిష్కారానికి జన్మభూమి : ఎంఎల్ఎ

**ప్రజాశక్తి - విజయవాడ**

ప్రజలకు అవసరమయిన వాటిని తెలుసుకొని, వాటి పరిష్కారం కోసమే "జన్మభూమి- మా ఊరు" కార్యక్రమం ఉద్దేశ్యమని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గంలోని 11వ డివిజన్, రాణిగారితోట 16వ డివిజన్‌లో గురువారం "జన్మభూమి- మా ఊరు" కార్యక్రమం జరిగింది. ఈ డివిజన్లలో జరిగిన కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్లు వీరంకి డాంగేకుమారి, కె శివశంకర్ అధ్యక్షత వహించారు. 16వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమానుద్దేశించి ఎమ్మెల్యే గద్దె మాట్లాడుతూ 16వ డివిజన్‌లో రోడ్డు నిర్మాణంతో పాటు భూగర్భ డ్రైయినేజి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇళ్ల పట్టాల సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామన్నారు. కళ్యాణమండపం నిర్మాణానికి త్వరలోనే పనులు ప్రారంభిస్తామన్నారు. జాతీయ రహదారిపై సబ్‌వే నిర్మాణం చేసి అక్కడి సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. కమిషనర్ జె నివాస్ మాట్లాడుతూ డివిజన్‌లోని 40 గ్రూపులకు రూ. కోటి యాభైలక్షల వరకు ఈ ఏడాది కాలంలో డివిజన్‌లోని డ్వాక్రా సంఘాలకు అందించామని పేర్కొన్నారు. డివిజన్‌లో నూతనంగా నిర్మించిన మరుగుదొడ్లను కమిషనర్‌తో కలిసి ఎమ్మెల్యే రామమోహన్‌రావు ప్రారంభించారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా 35 మంది గర్భిణులకు తన సొంత నిధులతో చీరలను అందజేశారు. అనంతరం ఆరుగురికి సిఎం సహాయ నిధి పంపిణీ చేశారు.

11వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమానుద్దేశించి మేయర్ కోనేరు శ్రీధర్ మాట్లాడుతూ జన్మభూమిలో దరఖాస్తు చేసుకునే వారు వివరంగా తెలుసుకోవాల్సి ఉందన్నారు. అనంతరం 21 మందికి సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నజీర్, నాయకులు గద్దె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సీమంతం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే గద్దె, మేయర్ శ్రీధర్

## విఎంసి సిఎంఒహెచ్‌గా అర్జున్‌రావు

**ప్రజాశక్తి - విజయవాడ**

గుంటూరులో ప్రాజెక్టు ఆఫ్ డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ (పిఒడిటి), అడిషనల్ డిఎంఅండ్‌ఒహెచ్‌గా పని చేస్తున్న డాక్టర్ అర్జున్‌రావును విజయవాడ నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం ముఖ్యఅధికారిగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రజారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య నుంచి రెండు రోజుల క్రితం ఉత్తర్వులు విడుదలయ్యాయి. డాక్టర్ అర్జున్‌రావు శుక్రవారమే విధుల్లో చేరతారని ప్రచారం నడిచినా, ఆయన సోమవారం చేరతారని విఎంసి అధికారులు వివరిస్తున్నారు. డిప్టేషన్‌పై వస్తున్న డాక్టర్ అర్జున్‌రావు రెండు సంవత్సరాలు సిఎంఒహెచ్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. అయితే ఇక్కడ సిఎంఒహెచ్‌గా పని చేసిన డాక్టర్ గోపినాయక్ అవినీతి కేసులో సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. సర్కిల్-2 ఎఎంఒహెచ్‌గా పని చేస్తున్న డాక్టర్ బాబు శ్రీనివాస్ ఇన్‌ఛార్జి సిఎంఒహెచ్‌గా వ్యవహరిస్తున్నారు. నాలుగు నెలల నుంచి ఖాళీగానున్న సిఎంఒహెచ్ పోస్టును ప్రభుత్వం భర్తీ చేయడంతో ప్రజారోగ్య విభాగం కార్యకలాపాలు సక్రమంగా నడిచే అవకాశం ఉంది.

## అందుబాటులో ప్రోనియస్ సోలార్ ఇన్వర్టర్లు

**ప్రజాశక్తి - విజయవాడ అర్బన్**

సోలార్ పీవీ స్ట్రింగ్ ఇన్‌వర్టర్లను సరఫరా చేస్తున్న ప్రోనియస్ ఇండియా రానున్న రెండేళ్లలో రెట్టింపు వ్యాపారం చేయడమే లక్ష్యంగా విస్తరణ ప్రారంభించినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పి.వి. కామత్ ఒక ప్రకటనలో తెలిపారు. లాభాలను పెంచుకోవకడంతోపాటు, మరింత సమర్థవంతమైన ఉపకరణాలను అందిస్తామన్నారు. ప్రస్తుతం మాన్యుఫాక్చరింగ్, ఆటోమోటివ్, హాస్పిటాలిటీ, ఎడ్యుకేషన్ రంగాలతో పాటు పలు ప్రభుత్వ విభాగాలకు తాము సేవలను అందిస్తున్నామని తెలిపారు. విజయవాడ, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాలలో ప్రోనియస్ సోలార్ ఇన్వర్టర్లను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

## బహిరంగ మలవిసర్జనపై ర్యాలీ

**ప్రజాశక్తి - కంకిపాడు**

ఆత్మగౌరవాన్ని ప్రతిఒక్కరు కాపాడుకునేందుకు ప్రయత్నించాలని బహిరంగ మలవిసర్జనను సామూహికంగా వ్యతిరేకించాలని కార్యదర్శి చింతా కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కంకిపాడు, పునాదిపాడు, ఉప్పలూరు, మద్దూరు, కాసరనేనివారిపాలెం గ్రామాల్లో గురువారం చెంబుచచ్చింది - ఆత్మగౌరవం గెలిచింది అనేనినాదంతో ర్యాలీలు నిర్వహించారు.ఆత్మగౌరవదిక్షలో భాగంగా గ్రామాల్లో పలు కార్యక్రమంలో నిర్వహించారు. దీనిలో భాగంగా చెంబుకు పూలమాల వేసి పాటికట్టి శవయాత్ర నిర్వహించారు.

## నేడు జన్మభూమి జరిగే ప్రాంతాలు

**ప్రజాశక్తి - విజయవాడ**

జన్మభూమి- మా ఊరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మూడు నియోజకవర్గాల పరిధిలో పలు డివిజన్లలో జరుగుతుంది. పశ్చిమ నియోజకవర్గంలోని 30వ డివిజన్ కెఎల్‌రావు పార్కు రోడ్డులో ఉదయం 10 గంటలకు జన్మభూమి కార్యక్రమం ప్రారంభమవుతుంది. 31వ డివిజన్ కర్మిల్ చర్చి రోడ్డు ఎదురుగా కోళ్లఫారమ్ సెంటర్ దగ్గర ఉదయం 12 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుంది. నోడల్ అధికారి కె కోటేశ్వరరావు, టీమ్ లీడర్ యం రవికుమార్, స్థానిక కార్పొరేటర్ల అధ్యక్షతన జరుగుతుది. సెంట్రల్ నియోజకవర్గంలో 56వ డివిజన్ వాంబేకాలనీ సి బ్లాక్ అపార్ట్‌మెంట్ గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు జన్మభూమి కార్యక్రమం ప్రారంభమవుతుంది. 58వ డివిజన్ రాజీవ్‌నగర్‌లోని కమ్యూనిటీ హాలులో ఉదయం 11.15 గంటలకు, 19వ డివిజన్‌లో కర్నాటి రామమోహన్‌మునిసిపల్ స్కూల్‌లో సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమం నడుస్తుంది. తూర్పు నియోజకవర్గంలో 12వ డివిజన్ దర్శిపేటలోని రాజరాజేశ్వరి కళ్యాణమండపంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుంది. కృష్ణలంక 23వ డివిజన్‌లోని ఎపిఎస్ఆర్ఎంసి హైస్కూల్‌లో ఉదయం 11 గంటల నుంచి జన్మభూమి జరుగుతుంది. నోడల్ అధికారి ఎంఐజాక్ ప్రభాకర్ పర్యవేక్షణలో టీమ్ లీడర్స్ డిఇలు ఎస్ సుహాసిని, కె కోటేశ్వరరావు , స్థానిక కార్పొరేటర్ల అధ్యక్షతన జరుగుతుంది.

# నిరసనలు, నిలదీతల మధ్య 'జన్మభూమి'

- యర్రబాలెంలో సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజలు, సిపిఎం
- సమాధానం చెప్పకుండా వెనుదిరిగివెళ్లిన అధికారులు
- పెన్షన్ ఇవ్వడంలేదంటూ శాపనార్థాలు పెట్టిన మహిళలు



జన్మభూమి సభలో అధికారులను నిలదీస్తున్న సిపిఎం నేత ఎం.రవి

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

రాజధాని గ్రామమైన యర్రబాలెంలో పేదలు నివసిస్తున్న బసవతారకనగర్ ఎస్సి ఎస్టి కాలనీలను అభివృద్ధి చేయకుండా వాటిపై సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని, పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, జన్మభూమి సభలు రాజకీయ ప్రచారానికా, సమస్యల పరిష్కారానికా అని రాజధాని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి ప్రశ్నించారు. గురువారం నాడు యర్రబాలెం గ్రామంలో మంగళగిరి తహశీల్దార్ వసంతకుమార్ అధ్యక్షతన జరిగిన జన్మభూమి సభలో సమస్యలపై ప్రజలు అధికారులను నిలదీశారు. సమాధానం చెప్పలేక అధికారులు వెనుదిరిగి వెళ్ళిపోయారు. సమస్యలు తెలిపేందుకు ప్రజలకు మైకు ఇవ్వడమేకాకుండా తెలుగుదేశం జిల్లా నేత మన్నవ సుబ్బారావు ప్రతిపక్ష పార్టీలపై అవాకులు, చావాకులు పేలారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అర్హులైన పేదలకు ఇవ్వాల్సిన సామాజిక పెన్షన్లను నిలిపివేశారని, గత జన్మభూమిలో ఇచ్చిన అర్జీలను ఎన్ని పరిష్కరించారో తెలపాలని డిమాండ్ చేశారు. యర్రబాలెం ప్రజలకిచ్చిన హెల్త్‌కార్డులు ఏ ఒక్కరికీ ఉపయోగపడటంలేదన్నారు. విజయవాడకు బస్సు సౌకర్యం ఎత్తివేయడాన్ని తప్పుబట్టాడు. యర్రబాలెం చెరువును సుందరీకరించి వాకింగ్ ట్రాక్ ఏర్పాటుచేయాలన్నారు. రాజధానిలో భూములు కోల్పోయిన వారికి ఎటువంటి ఉపాధి చూపలేదన్నారు. అలాగే ఇళ్ల నిర్మాణంలో మోసపూరిత మాటలు చెబుతున్నారన్నారు. గ్రామంలో ప్రమాదాలకు కారణమవుతున్న ఇసుక లారీలను నియంత్రించాలని కోరినందుకు గ్రామస్తులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణం ఎత్తివేయాలని డిమాండ్‌చేశారు.

డివైఎఫ్ఐ రాజధాని డివిజన్ నాయకులు కె.సుందరయ్య, వైసిపి నేత బుజ్జి, మాట్లాడుతూ కేజీ టు పిజి వరకు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ మా గ్రామంలో ఒక్కరికైనా ఇచ్చారా సిఆర్‌డిఎ అధికారులను నిలదీశారు. ఇప్పుడు అప్పుడు అంటూ కాలయాపన చేయడం తప్పా ఫీజులు ఎందుకు చెల్లించరని అడిగారు. గ్రామంలో ఉన్న గ్రంథాలయాన్ని పడగొట్టి తిరిగి నిర్మించకుండా గ్రంథాలయ పన్ను ఎందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నించారు.

పెన్షన్లు, రేషన్‌కార్డులకొరకు అనేకసార్లు అర్జీలు పెట్టినా ఇదిగో అదిగో అంటూ తిప్పుతున్నారు గానీ తమకు ఎందుకు ఇవ్వడంలేదని ప్రజలు ఒక్కసారిగా వేదిక వద్దకు వచ్చి అధికారులను నిలదీయడంతో సమాధానం చెప్పలేక వెనుదిరిగి వెళ్ళిపోయారు. తెలుగుదేశం నాయకులు ఆకుల ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ గ్రామ ప్రథమ పౌరుడు సభలోపాల్గొనపోవడం దురదృష్టకరమని అన్నారు. ఈ సభలో జెడ్పిటిసి ఆకుల జయసత్య, మండల ఉపాధ్యక్షులు మొసలి పకీరయ్య, చావలి ఉల్లయ్య, ఎంపిటిసిలు సుధాహనుమాయమ్మ, వార్డు సభ్యులు, ఇతర అధికారులు,సిపిఎం గ్రామ కార్యదర్శి అత్తలూరి వీరవెంకయ్య, నాయకులు గడ్డం కాంతారావు పాల్గొన్నారు.

## భూసేకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కోసం నిర్ణయం



మాట్లాడుతున్న కె.ఈశ్వరరెడ్డి

**ప్రజాశక్తి - తాడేపల్లి**

రాజధాని అమరావతిలో సీడ్ క్యాపిటల్‌లో భాగమైన ఉండవల్లి లో ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేయాలని భూపరిరక్షణ కమిటీ నిర్ణయించింది. ఈసందర్భంగా పరిరక్షణ కమిటీ నాయకులు కొర్రపోలు జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం బలవంతంగా రైతుల నుండి భూములు తీసుకోమని గతంలో చెప్పి నేడుమాట తప్పిందని విమర్శించారు. సారవంతమైన ఈ భూములను నమ్ముకొని చిన్నసన్నకారు రైతులే అధికంగా ఆధారపడి ఉన్నారని పేర్కొన్నారు. పరోక్షంగా ఈ భూములపై 2వేలమంది వ్యవసాయ కార్మికులు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. సిఆర్‌డిఎ చట్టంలోపేర్కొన్న వివిధ క్లాజుల ప్రకారం ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో మూడు పంటలు పండే భూములు తీసుకోవడానికి వీల్లేదని చట్టమే చెబుతుందని వివరించారు. ప్రభుత్వమే చట్ట ఉల్లంఘనకు పాల్పడితే తామేమి చేయాలని ప్రశ్నించారు. అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి ఇక్కట్ల పాలు కావద్దని కోరారు. ఇందుకోసం బాధిత రైతుల నుండి పెద్దఎత్తున సంతకాలు సేకరణ చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. అప్పటికైనా ఈ ప్రభుత్వం మంచిగా ఆలోచించి రైతులకు న్యాయం చేస్తుందని ఆకాంక్షించారు.

## తీరిన చిరకాల స్వప్నం



ప్రారంభమైన బస్సు సర్వీసు

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

మండలంలోని వీర్లపాలెం, పెదకొండూరు, గొడవర్రు గ్రామాలతోపాటు కృష్ణానది పరీవాహక ప్రాంతాల ప్రజల చిరకాల స్వప్నం తీరింది. విజయవాడ నుండి రేపల్లె వరకు కరకట్టమీదుగా బస్సులు వేయాలని, వారు అనేకసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తులు చేస్తున్నారు. గురువారం విజయవాడ నుండి రేపల్లె వరకు ఆర్‌టిసి బస్సు సర్వీసు ప్రారంభించారు. ప్రస్తుతం విజయవాడ నుండి పెదకొండూరు వరకు రూ.13, గతంలో విజయవాడ వెళ్ళాలంటే దాదాపు రూ.40ల వరకు ఖర్చు పెట్టవలసి వచ్చేది. ఇందుకు మూడు ట్రిప్పులు తిరుగుతుందని అధికారులు తెలిపారు.



లోకేష్‌కు చెక్కును అందిస్తున్న జెడ్పీటసీ జయలక్ష్మి దంపతులు

## రాజధానికి విరాళం

**ప్రజాశక్తి-తెనాలిటౌన్**

నవ్యాంధ్ర రాజధాని నిర్మాణానికి రూ.లక్ష చెక్కును విరాళంగా తెనాలి జెడ్పీటీసీ సభ్యురాలు అన్నాబత్తుని జయలక్ష్మి దంపతులు గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌కు అందించారు. కొల్లిపర మండలం అత్తోటలో గురువారం జరిగిన జన్మభూమి-మావూరు కార్యక్రమంలో చెక్కును అందించి, లోకేష్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్, కావేటి సామ్రాజ్యం, వంగా సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భారీ వాహనాలతో ధ్వంసమవుతున్న రోడ్లు



శాఖమూరులో 'స్వచ్ఛసేవ' ర్యాలీ

**ప్రజాశక్తి-తుళ్ళూరు**

రాజధాని రోడ్ల నిర్మాణం కారణంగా భారీవాహనాల రాకపోకలు పెరిగాయని. దీంతో మండల కేంద్రం తుళ్ళూరుకు అనుసంధానంగా నిర్మించిన రోడ్లు ధ్వంసమవుతున్నాయని శాఖమూరు గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. భారీ వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయంగా పొలాల్లో రోడ్లు నిర్మించుకోవాలని కోరారు. గురువారం రాజధాని ప్రాంతం, తుళ్ళూరు మండలంలోని శాఖమూరు గ్రామంలో తహశీల్దార్ ఎం పూర్ణచంద్రరావు నేతృత్వంలో అధికారుల బృందం 'జన్మభూమి-మాఊరు' కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను ప్రస్తావించారు.గ్రామంలో మురుగునీటి సమస్య ఉందని, పరిష్కరించాలని కోరారు.గృహ అవసరాలకు వినియోగించే నీరు పాచిపట్టి దుర్గంధం వేస్తోందని చెప్పారు.వైఎస్సార్‌సిపి యువజన విభాగం నాయకులు బెజ్జం రాంబాబు మాట్లాడుతూ రాజధాని ప్రాంతంలో విద్యార్థులకు ఫీజురీయింబర్సుమెంటు ఇప్పటివరకు అమలుచేయలేదన్నారు.చెరువునీటి వల్ల ఎలర్జీ వస్తోందని అనడంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది.రాంబాబుకు,టిడిపి ఎస్సీసెల్ నాయకులు తలతోటి సురేంద్ర మధ్య వాగ్వివాదం జరిగింది. గ్రామస్థులు సర్దిచెప్పడంతో గొడవ సద్దుమణిగింది. తొలుత గ్రామంలో' స్వచ్ఛసేవ' ర్యాలీ జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంఈవో జి.కోటేశ్వరరావు,ఈవోపీఆర్‌డీ నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ తుమ్మూరు వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్దల సదాశివరావు,తుళ్ళూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి దివ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు. వెలగపూడిలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో 9,10,ఇంటర్, పాలిటెక్నిక్ విద్యార్థులు 115 మందికి రూ1200 చొప్పున ఉపకారవేతనాలు, డ్వాక్రా మహిళలకు రుణాలు పంపిణీ చేశారు.

## 7న 'సూర్యుడిని నెత్తికెత్తుకొని' గ్రంథావిష్కరణ

**ప్రజాశక్తి-కార్పొరేషన్**

జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న సాయంత్రం 6.30 గంటలకు డాక్టర్ రావి రంగారావు రచించిన 'సూర్యుడిని నెత్తికెత్తుకొని' గ్రంథావిష్కరణ జరుగుతుందని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎం.సుభాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక బృందావనగార్డెన్స్‌లోని వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై గ్రంథావిష్కరణ సభ ఉంటుందన్నారు. సభకు కవి, రచయిత డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహిస్తారని, ముఖ్య అతిథిగా సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. సాహితీవేత్త సోమేపల్లి వెంకటసుబ్బయ్య, విజయలక్ష్మి దంపతులు గ్రంథ స్వీకరణ చేస్తారని, డాక్టర్ రెంటాల వెంకటేశ్వరరావు గ్రంథ సమీక్ష చేస్తారన్నారు. డాక్టర్ నల్లపనేని విజయలక్ష్మి గ్రంథాన్ని విశ్లేషిస్తారని పేర్కొన్నారు.

## నేడు తుళ్లూరులో విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి-తుళ్ళూరు:** విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం తుళ్ళూరు గ్రామంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ లక్ష్మీనారాయణ చెప్పారు.ఉదయం 10 గంటలనుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

# జోసిల్ కంపెనీలో ప్రమాదం

## కుడి చేతిని కోల్పోయిన కార్మికుడు



ప్రమాదంలో చేయి కోల్పోయిన కార్మికుడు ఆనంద్

**ప్రజాశక్తి-మేడికొండూరు**

విధి నిర్వహణలో ఉన్న కార్మికునికి కుడిచేయి సగానికి పైగా కోల్పోయిన సంఘటన గురువారం మండలంలోని డొకిపర్రు జోసిల్‌కంపెనీలో చోటుచేసుకుంది. ఫిరంగిపురం శాంతిపేటకు చెందిన తెనాలి ఆనంద్ పదిహేను సంవత్సరాలుగా జోసిల్ కంపెనీలో కార్మికునిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం రెండోషిఫ్ట్‌లో టిఎన్‌డి విభాగంలో పని చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు మిషన్‌లో తన కుడి చేయి పడి సగానికిపైగా నుజ్జయింది. సమీపంలోని తోటి కార్మికులు ప్రమాద విషయాన్ని గమనించి వెంటనే మిషన్‌స్విచ్ ఆఫ్‌చేసి ఇరుక్కుపోయిన చేయిని బయటకుతీశారు. వెంటనే కంపెనీ అబులెన్స్‌లో గుంటూరులోని ఒక ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసకున్న సహచర కార్మికులు ఒక్కసారిగా విచారానికి గురయ్యారు.

**బాధిత కార్మికునికి కంపెనీ అండగా ఉంటుంది**

కంపెనీలో చోటుచేసుకున్న ప్రమాద సంఘటనలో చేయికోల్పోయిన కార్మికుడు ఆనంద్‌కు , అతనికుటుంబానికి కంపెనీ అండగా నిలుస్తుంది. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతోపాటు, కార్మికచట్టాలకు లోబడి అమలుచేస్తున్న బీమా పరిహారాలు అందేలాచర్యలు తీసుకుంటామని జోసిల్ ఎండి జాగర్లమూడి మెరళీమోహన్



మాట్లాడుతున్న ...

## అమృతసాయిలో అవగాహన సదస్సు

**విజయవాడ రూరల్ :** అమృతసాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనాన్షియల్ ప్లానింగ్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రుడెంట్ ఎడ్వైజరీ సర్వీసెస్ విజయవాడ మేనేజర్ టి.అశోక్‌రెడ్డి, ఫైనాన్షియల్ ఎడ్వైజర్ ఎం.రాజేష్ మాట్లాడుతూ సాధారణంగా బ్యాంకు డిపాజిట్, పోస్టల్ ఆర్‌డిలు, గోల్డ్‌పై ఇన్వెస్ట్‌మెంట్స్ దవ్యోల్బణానికి గురవుతాయని, దాని వల్ల రాబడులు తగ్గిపోయే అవకాశం ఉందని అన్నారు. మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడం ద్వారా ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిఇఒ సాయిమనోజ్, కళాశాల ప్రిన్సిపల్ శేఖర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలన పారదర్శకం : జడ్‌పిటిసి

**ప్రజాశక్తి - కంకిపాడు**

జన్మభూమి గ్రామసభలతో ప్రభుత్వ పాలన పారదర్శకంగా జరుగుతుందని జడ్పిటిసి సభ్యుడు గొంది శివరామకృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని కందలంపాడు, కుందేరు గ్రామాల్లో ఐదో విడత జన్మభూమి గ్రామసభ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుందన్నారు. అనంతరం వివిధ పథకాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఓఒ కృష్ణమోహన్, తహశీల్దార్ ఎల్లారావు, మండల ప్రత్యేక అధికారి వెంకటరమణరెడ్డి, సర్పంచి ఉదయకుమారి పాల్గొన్నారు.

## ఇద్దరిపై బైండోవర్

సంక్రాంతి పండుగ పురస్కరించుకోని కోడిపందాలు,పేకటశిబిరాలు వంటివాటిని నిర్వహించే ఆవకాశమున్న ఇద్దరు వ్యక్తులను స్థానిక పోలీసులు గురువారం బైండవర్ కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం గొడవర్రు గ్రామానికి చెందిన కాగిత నరేష్, మంతెన గ్రామనికి చెందిన వీరంకి వెంకటరమణ గతంలో కోడిపందేలు నిర్వహించారు. మరలా పండుగను పురస్కరించుకుని కోడిపందేలు నిర్వహిస్తారనే సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## విద్యార్థులకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి - గన్నవరం**

అరుణ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో పేద విద్యార్థులకు గురువారం సిడిసి మాజీ ఛైర్మన్ నల్లూరి వెంకటేశ్వరరావు ఫీజులు అందజేశారు. అనంతరం వెంకటనరసింహపురానికి చెందిన లక్ష్మణరావుకు సిఎం సహాయనిధి రూ.40 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండ్లమూడి ఆంజనేయప్రసాద్ పాల్గొన్నారు.

# పరిశుభ్రతతో ఆరోగ్యానికి భద్రత

**ప్రజాశక్తి - గన్నవరం**

మన చుట్టు ప్రక్కల పరిశుభ్రతగా ఉంటేనే ప్రజలంతా ఆరోగ్యంగా ఉంటారని ఎంపిపి పట్రా కవిత, జడ్పిటిసి మరీదు లక్ష్మీదుర్గలు అన్నారు. గురువారం మండలంలోని వీరపనేనిగూడెంలో ఆత్మ గౌరవ దీక్షలో భాగంగా వెలుగు స్కూలు, జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు చేపట్టిన ఒడిఎఫ్ ర్యాలీని వారు ప్రారంభించి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్డిని వాడాలని, ఆరుబయటకు చెంబు తీసుకెళ్లే పరిస్థితి మానుకోవాలని చెప్పారు. బహిరంగ మల విసర్జన చేయడం వల్ల భూ గర్భజలాలతో పాటువాతావరణం కలుషితమై రోగాలు వ్యాపిస్తాయన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించేందుకు అందరూ కృషి చేయాలన్నా రు. ఎంపిడిఒ వై. ఇందిరాప్రియదర్శిని మాట్లాడుతూ మరుగు దొడ్డి లేని వాళ్లుంటే వారు కట్టుకోడానికి రూ.15 వేలు సహాయంగా ఇస్తామన్నారు. డ్వాక్రా సభ్యులైతే మరో రూ.10 వేలు ఇ స్తారని, మొత్తంగా రూ.25వేలతో దొడ్డి కట్టుకోవచ్చన్నారు. ప్ర భుత్వం కల్పిస్తున్న ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అనంతరం ర్యాలీ వెలుగు స్కూలు నుంచి ప్రారంభమైన గ్రామ వీధుల్లో సాగింది. బహిరంగ మలవిసర్జన చేయొద్దని, రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, అందరూ మరుగుదొడ్లనే వాడాలని పిల్లలు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. ఈకార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ భూక్యా ఉమాదేవి, కార్యదర్శి బి.సాంబశివరావు, వీరపనేనిగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరావు, వెలుగు స్కూలు ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు


**వికెఆర్ కళాశాల విద్యార్థుల ర్యాలీ**

పరిసరాల శుభ్రతపై వికెఆర్ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వ హించారు. ప్రభుత్వం ఇస్తున్న మొక్కలను తీసుకుని నాటడం ద్వారా పచ్చదనం మెరుగుదలకు కృషి చేయాలని ఏడి డాక్టర్ కొడాలి రాజేశ్వరి అన్నారు. ఇల్లు, రోడ్లు, బహిరంగ ప్రదేశాలు శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# జూద ప్రాంతాల పరిశీలన

**ప్రజాశక్తి - కంకిపాడు**

సంక్రాంతి సందర్భంగా గ్రామాల్లో కోడిపందేలు, పేకాట శిబిరాలు, ఇతర జూదక్రీడల నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ గజరావ్ భుపాల్ హెచ్చరించారు. మండలంలోని కందలంపాగు గ్రామంలో గురువారం జూదక్రీడలు నిర్వహించటానికి అనవుగా ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు కోడిపందాలు,జూదక్రీడలు నిర్వహించకుండా నియంత్రించడానికి కమిటీ ఏర్పాటు చేశామన్నారు. వీరి గ్రామాల్లో పర్యటించి అనుమానాస్పదంగా ఉన్న ప్రాంతాలను ప్రాంతాలను పరిశీలించి గ్రామస్తులకు ఆవగాహన కల్పిస్తారన్నారు. గతంలో పందేలు నిర్వహించిన వారిని బైండవర్ చేసుకున్నామన్నారు. సాంప్రదాయం పేరుతో కోళ్లకు కత్తులు కట్టినట్లయితే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. చుట్టపక్కలు కోడిపందేలు, పేకాట శిబిరాలు ఎక్కడెక్కడ నిర్వహిస్తారని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఏసిపి విజయభాస్కర్, ఎంఓఒ కృష్ణమోహన్, తహశీల్దార్ ఎల్లారావు, సిఐ శ్రీధర్‌కుమార్, ఎస్ఐ హనీష్ తదితరులు పాల్గొన్నారు.



జూద ప్రాంతాలను పరిశీలిస్తున్న డిసిపి

# కోడిపందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు : ఏసిపి

**ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం**

ఇబ్రహీంపట్నం మండల పరిధిలో కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని విజయవాడ వెస్ట్ జోన్ ఏసిపి జి.రామకృష్ణ తెలిపారు. గురువారం ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోళ్లకు కత్తులు కట్టి కోడి పందాలు నిర్వహించే వారిపైన రౌడీషీట్లు తెరవనున్నట్లు పేర్కొన్నారు. హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం మండల స్థాయి, డివిజన్ స్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలకు మండల తహసీల్దారు, ఎంపిడిఓ, పశువైద్యులు, ఎస్సైలు కమిటీ సభ్యులుగా ఏర్పడి ప్రతీ రోజూ గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయడంతోపాటు అనుమానిత ప్రాంతాల్లో తనిఖీలు చేస్తారన్నారు. ఈ కమిటీలు గురువారం నుండి అమల్లోకి వచ్చినట్లు తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు వెంకట్రామయ్య మాట్లాడుతూ కోడిపందాలు, జూదం వంటివి మండల పరిధిలో నిషేధించినట్లు తెలిపారు. కోడి పందాలు, జూదం, పేకాట శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిస్తే 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎంపిడిఓ శ్రీనివాసరెడ్డి, సిఐ చవాన్, పశు వైద్యులు హరినాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసిపి రామకృష్ణ



మంత్రి సునీతను కలిసి వెంకట్

# స్పందన పాఠశాలకు చేయూత కోసం వినతి

**ప్రజాశక్తి - గన్నవరం**

గన్నవరం మండలం దావాజిగూడెంలోని స్పందన ప్రత్యేక అవసరాల బాలల పాఠశాలకు ప్రభుత్వం నుంచి చేయూత అందేలా చూడాలని కోరుతూ రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల శాఖా మాత్యులు పరిటాల సునీతమ్మకు ఆ పాఠశాల కరస్పాండెంట్ సంకాబత్తుల వెంకట్ గురువారం వినతి పత్రం సమర్పించారు. విజయవాడలో మంత్రిని కలిసి తమ పాఠశాలద్వారా వికలాంగులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచితంగా చేస్తున్న సేవలు వివరించినట్లు వెంకట్ తెలిపారు. దాతల సహకారంతో అనేక కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పామన్నారు. ప్రభుత్వం నుంచి సహకారం అందితే మరింత మంది వికలాంగులకు చేయూత నివ్వడానికి అవకాశం ఉంటుందని కోరామన్నారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి పాఠశాలకు చేయూత అందేలా చూస్తామని ఆమె హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలకు చెందిన వి.అమల్‌దాస్ పాల్గొన్నారు.

## వర్గీకరణ బిల్లు కోరుతూ దీక్షలు

**ప్రజాశక్తి - గన్నవరం**

పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎస్‌సి వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం సూరంపల్లిలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టారు. దీక్షలను ఆ సంఘం డివిజన్ ఇన్‌ఛార్జి వేణుబాబు మాట్లాడుతూ వర్గీకరణ బిల్లు కోసం ఆంధ్రా, తెలంగాణా ముఖ్యమంత్రులు ఢిల్లీకి అఖిల పక్షం తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చోడవరపు వెంకటేశ్వరరావు, తాడిగడప రవిబాబు, పులిపాక బాబూరావు, సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మౌజన్ హత్య పై సమగ్ర విచారణ జరపాలి

**ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం**

రాజమండ్రి మసీదులో మౌజన్ ఫారూక్ దారుణ హత్యపై సమగ్ర విచారణ జరపాలని ముస్లీం మతగురువులు సూఫీ అల్తాఫ్ రాజా డిమాండ్ చేశారు. కొండపల్లి లోని సయ్యద్ షాబుఖారి మసీదులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మౌజన్ ఫారూక్‌ను హత్య చేసినవారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆయేషా మీరా కేసులో బాధితులకు న్యాయం జరగలేదని అభిప్రాయపడ్డారు. మౌజన్ హత్యకేసును పకడ్బందీగా విచారణ చేయాలన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక ప్రక్క రాష్ట్రం అభివృద్ధి సాధిస్తున్న తరుణంలో ఇటువంటి ఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో హఫీజ్ సమ్మాని మౌలానాతన్వీర్, హఫీజ్ ఖయ్యుం, సాదిక్ నిజామి తదితరులు పాల్గొన్నారు.

## బోయపాటిని పరామర్శించిన నాయకులు

**ప్రజాశక్తి - గన్నవరం**

మాతృ వియోగానికి గురైన బిబిగూడెం కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు బోయపాటి మురళీకృష్ణను గురువారం వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకట్రావు పరామర్శించారు. ఆ పార్టీ నాయకులు కాసన్నేని గోపాలరావు, తుల్లిమిల్లి ఝాన్సీలక్ష్మి, గ్రామ సర్పంచ్ తమ్మిశెట్టి రఘుబాబు తదితరులు కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు, మాజీ జడ్పిటిసి సభ్యులు మల్లంపల్లి జయమ్మ, పార్టీ మండల నాయకులు పిల్లి మహేష్, సిఐటియు నాయకులు చినబాబు తదితరులు మురళీకృష్ణను ఇంటి వద్ద కలిసి పరామర్శించారు.

## కుర్చీలు బహూకరణ

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని భవిత కేంద్రానికి గురువారం వీనస్ కాంప్లెక్స్ అధినేత మడుపల్లి సత్యనారాయణ జయంతిని పురస్కరించుకుని ఆయన మనుమడు విద్యాసాగర్ 15 కుర్చీలు గురువారం బహూకరించారు. ప్రత్యేక అవసరాలు గల బాలలకు ఉపయోగపడే కుర్చీలు ఇవ్వడం ఆనందంగా ఉందని విద్యాసాగర్ అన్నారు. ప్రతి ఏడాది తన వంతు సహాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మార్గరేట్, రిసోర్స్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, రోజారాణి పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే జన్మభూమి

**ప్రజాశక్తి - గన్నవరం**

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే జన్మభూమి కార్యక్రమమని మండల ప్రత్యేక అధికారి సుధాకర్ అన్నారు. గురువారం మండలంలోని కొత్తగూడెం, వీరపనేనిగూడెం పంచాయతీ కార్యాలయాల్లో జరిగిన జన్మభూమి– మీ ఊరు గ్రామ సభల్లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జనాలకు చేరువయ్యేలా చూస్తామన్నారు. ప్రతి వ్యక్తి రూ.15 చెల్లిస్తే రూ.5 లక్షలు ప్రమాద బీమా పొందే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపిడిఓ ఇందిరా ప్రియదర్శిని అన్నారు. తహశీల్దార్ మాధురి మాట్లాడుతూ రెవెన్యూ సేవలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పట్రా కవిత, జడ్పిటిసి మరీదు లక్ష్మీదుర్గ, సర్పంచులు ఉమాదేవి, ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి సాంబశివరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బాండ్ సేవలకు ప్రజల వద్ద నుండి మంచి ఆదరణ లభిస్తుందని, బ్రాడ్‌బాండ్ సేవలను వరింత విస్తరించనున్నట్లు బి.ఎస్.ఎన్.ఎల్. ఎపి. సర్కిల్ చీఫ్‌జనరల్ మేనేజర్ ఎ.పూర్ణచంద్రరావు తెలిపారు. చుట్టుగుంటలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.

## విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - గన్నవరం

విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీయడానికి డ్రాయింగ్ పోటీలు దోహదపడతాయని సర్పంచ్ కొలుసుమహాలక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని చిక్కవరం ఎంపిపి స్కూలులో విద్యార్థులకు డ్రాయింగ్,వ్యాసరచన పోటీలు నిర్వహించారు.ముఖ్య అతిథిగా మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలీఫైడ్ ఉపాధ్యాయులు ఉండటంతో పిల్లలకు విలువలతో కూడిన విద్య అందుతుందన్నారు. మధ్యాహ్న భోజనం, దుస్తులు, పుస్తకాలు, ఇతర ఉపకరణాలు ఇవ్వడం వల్ల పేద పిల్లలకు ఉపయుక్తంగా ఉందన్నారు. మంచి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులున్న స్కూలులో పిల్లలు చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణిస్తారన్నారు. విద్యార్థుల అభ్యున్నతికి హెచ్ఎం రాజబాబు చేస్తున్న కృషిని కొనియాడారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ఇస్తామని రాజబాబు తెలిపారు. ఈకార్యక్ర మంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బ్రాడ్‌బాండ్ సేవలకు ఆదరణ

## పెరిగిన మొబైల్ డేటా వినియోగం - బిఎస్ఎన్ఎల్ సిజిఎం పూర్ణచంద్రరావు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

బిఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బాండ్ సేవలకు ప్రజల వద్ద నుండి మంచి ఆదరణ లభిస్తుందని, బ్రాడ్‌బాండ్ సేవలను వరింత విస్తరించనున్నట్లు బి.ఎస్.ఎన్.ఎల్. ఎపి. సర్కిల్ చీఫ్‌జనరల్ మేనేజర్ ఎ.పూర్ణచంద్రరావు తెలిపారు. చుట్టుగుంటలోని బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.ఎస్.ఎన్.ఎన్. సంస్థ మూడు విధాలుగా బ్రాడ్‌బాండ్‌సేవలను అందిస్తుందన్నారు. ఇందులో భాగంగాకాపర్, ఫైబర్, వైఫైలో అందిస్తున్నామని తెలిపారు. బ్రాడ్‌బాండ్ సేవలకుసంబంధించి స్పీడ్‌ను పెంచుతున్నామని దీనిద్వారా ఇంటర్నెట్ సేవలు మరింత త్వరగా ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. ప్రతిబ్రాడ్‌బాండ్ కనెక్షన్‌తో పాటు వైఫై ఇస్తున్నామని తలెఇపారు. ఈఆర్థికసంవత్సరంలో


మాట్లాడుతున్న పూర్ణచంద్రరావు

బిఎస్ఎన్ఎల్ సంస్థ వివిధ కార్యక్రమాల అమలు, సౌకర్యాల కల్పనకు సంబంధించి రూ.175 కోట్ల రూపాయలు కేటాయించినట్లు తెలిపారు. వీటి ద్వారా టవర్లకు ఖర్చుచేసి కొత్త వాటిని ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. మొబైల్ కనెక్షన్స్‌కు సంబంధించి ఇప్పటి వరకు 68 లక్షల మంది వినియోగదారులు ఉన్నారని తెలియచేశారు. ఈఏడాది కొత్తగా పది లక్షల కనెక్షన్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. మొబైల్ ఫోన్లకు ఆదరణ పెరుగుతుందతని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ ఎపి సర్కిల్‌లో ల్యాండ్‌లైన్స్‌కు సంబంధించి మొత్తం 6.14 లక్షల కనెక్షన్లు ఉన్నాయని, వీటిలో అర్బన్ ప్రాంతంలో 3.98 లక్షలు, రూరల్ ప్రాంతాలలో 2.16 లక్షల కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. బిఎస్ఎన్ఎల్ సంస్థ అన్ని సేవలను అందించడంలో ప్రయివేటు సంస్థల కన్నా అగ్రస్థానంలో ఉందని, రానున్న కాలంలో కూడా సేవలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బిఎస్ఎన్ఎల్ సీనియర్ జనరల్ మేనేజర్ ఫైనాన్స్ జి.దుర్గారాణి, జనరల్ మేనేజర్లు ఎ.వెంకటేశ్వరరావు, బంగా రవికుమార్, వై.రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# త్వరలో నూతన భవనాలు ప్రారంభం

## విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్ ఎస్.రామకృష్ణారావు

కృష్ణా ప్రజాశక్తి - మచిలీపట్నం

కృష్ణా విశ్వవిద్యాలయాల నూతన భవన నిర్మాణాలు త్వరలో పూర్తిచేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేస్తామని వైస్ చాన్సలర్ ఎస్.రామకృష్ణారావు తెలిపారు. ఆయన ఛాంబర్‌లో గురువారం ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2008లో నెలకొల్పబడిన కృష్ణా విశ్వవిద్యాలయానికి సొంత భవనాలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొ న్నామన్నారు. ఈ ఇబ్బందుల నుండి త్వరలో విముక్తి లభిస్తుందన్నారు. రూ.72.86 కోట్లు గ్రాంటు ప్రభుత్వం ప్రకటించగా అందులో రూ.40 కోట్లు మాత్రమే అనుమతులు వచ్చాయన్నారు. ఆ నిధులతో పనులు ప్రారంభించామని తెలిపారు. మరో రూ.30 కోట్లు విడుదల చేస్తే విద్యార్థినీ, విద్యార్థులకు హాస్టల్ వసతి కూడా ఒనగూరుతుందన్నారు. 102 ఎకరాల స్థలానికి సంబంధించి కాంపౌండ్ వాల్ (ప్రహరీగోడ) నిర్మాణానికి ఆరేడు కోట్లు ఖర్చవుతున్నట్లుగా అంచనాలు తయారు చేస్తామన్నారు. భవన నిర్మాణాలకు దాతలు ముందుకొస్తే ఆ నిర్మించిన భవనానికి వారు సూచించిన పేరు పెడతామన్నారు. కృష్ణా యూనివర్శిటీ అంతర్ కళాశాలల యాజ మాన్యాలతో ఇప్పటికే సంప్రదించామని తెలిపారు. ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందన్నారు. మిగతా దాతలు ముందుకొచ్చి ఆదరించాలని కోరారు. కాంపౌండ్ వాల్


మాట్లాడుతున్న రామకృష్ణారావు

నిర్మాణానికి కూడా దాతలు ముందుకు రావాలని పేర్కొన్నారు. దేశంలో ఉన్న 700 యూనివర్శిటీల్లో కృష్ణా విశ్వవిద్యాలయం 158 నుండి 200 ర్యాంకు మధ్యలో ఉందన్నారు. యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఎన్నో జాతీయ క్రీడలను విజయవంతంగా నిర్వహిం చామన్నారు. ఇక్కడ జరిగిన క్రీడల్లో విజయం సాధించిన విద్యార్థులు మరిన్ని చోట్ల పాల్గొని ముందుకు సాగుతున్నారన్నారు.

# అలరించిన త్యాగరాజ కీర్తనలు

ప్రజాశక్తి - సత్యనారాయణపురం

సంగీత సన్మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనా సంగీతోత్సవం సంగీత ప్రియుల్ని విశేషంగా అలరిస్తుంది. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయి. గురువారం జరిగిన మల్లాది రవికుమార్ గాత్ర కచేరి అలరించింది. సామిక సరియనుచు జెప్ప ..బేగడ రాగం, ద్వైతము సుఖమా..రేతిగౌళ రాగం, పరాకునీకేలరా రామ...కిరణావళి రాగం తదితర కీర్తనలు గానం చేశారు. విష్ణుభోట్ల కృష్ణవేణి వయోలిన్‌పై కె.సాయి గిరిధర్ (చెన్నైయ్) మృదంగంపై సహకారం అందించారు.



గాత్ర కచేరి చేస్తున్న మల్లాది రవికుమార్

# దేశంలోనే అగ్రగామి జిల్లాగా కృషి చేస్తా

## జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం


లక్ష్మీకాంతంను సన్మానిస్తున్న మచిలీపట్నం ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు, పాత్రికేయులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

అన్ని రంగాల్లోనూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తూ దేశంలోనే అగ్రగామిగా చేస్తానని జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం తెలిపారు. గురువారం మచిలీపట్నం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటుచేసిన మీట్‌ది కలెక్టర్ కార్యక్రమంలో మాట్లాడుతూ అభివృద్ధి రేటులో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే అగ్రగామిగా ఉందని, దేశ వృద్ధి రేటులో 5.61 శాతం, రాష్ట్ర వృద్ధి రేటు 11.07 శాతం కాగా, జిల్లా వృద్ధి రేటు 20 శాతంతో ముందుకు దూసుకుపోతుందన్నారు. ప్రాథమిక రంగంలో వృద్ధి సాధిస్తూ ఆధార్, ఆధారిత ఎరువుల పంపిణీలో జిల్లా దేశంలోనే ప్రథమస్థానంలో ఉందన్నారు. చేయూత, అభ్యున్నతి, ఆత్మగౌరవ దీక్ష వంటి వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్నామన్నారు. పట్టిసీమ ద్వారా 32 వేల హెక్టార్ల అదనపు భూమిని సాగులోకి తెచ్చామని, ఉద్యానశాఖ ద్వారా 12 వేల హెక్టార్లలో సాగుచేస్తున్నామన్నారు. మూడు వేల ఎకరాల్లో పశుగ్రాస క్షేత్రాల ద్వారా పాడిపరిశ్రమ, మత్స్యశాఖ ద్వారా 8,08,000 మెట్రిక్ టన్నులు ఉత్పత్తులు సాధించి జివిఎ పెంపుదలలో పరోక్ష సహకారం అందిస్తు న్నట్లు కలెక్టర్ వెల్లడించారు. గనులు, భూగర్భ శాఖలో 214 శాతం వృద్ధి రేటుతో ముందుకువెళు న్నామని, నిర్మాణ రంగంలో 38 శాతం వృద్ధి రేటు నమోదు చేసి ఉద్యోగావకాశాలు కల్పించామని తెలిపారు. ఎరువుల పంపిణీలో ఆధార్ ఆధారిత ఎరువుల పంపిణీలో జిల్లాను దేశంలోనేప్రథమంగా నిలిపి 54 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను ఆదా చేసి ప్రకృతి వ్యవసాయంపై ముందుకువెళ్తున్నామన్నారు. మిషన్ అంత్యోదయలో ఎంపికైన 10 ఉత్తమ గ్రామపంచాయతీల్లో ఆరు గ్రామపంచాయతీలు మన జిల్లాకే రావడం జరిగిందన్నారు. పరిష్కార వేదికలో 45 వేల అర్జీలను నూరుశాతం పరిష్కరించామని, వ్యక్తిగత మరుగుదొడ్లను ప్రతిఒక్కరూ వినియోగించుకునేలా ఆత్మగౌరవ దీక్షలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించామని, ఉత్సవాల్లో ఒకేరోజున 3.20 లక్షల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని గిన్నీస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరు నమోదు అయిందన్నారు. జిల్లాలో ప్రతి కుటుంబం రూ.10 వేల ఆదాయం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని, 2.27 లక్షల మందిని గుర్తించి రాబోయే సంవత్సరంలోపు ఆదాయం పొందే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. 1.39 లక్షల మంది విభిన్న ప్రతిభావంతులకు ఉపకరణాలు అందించి డిసెంబర్ నాటికి ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూరే విధంగా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఘంటసాలలో 150 అడుగుల బుద్ధవిగ్రహాన్ని ఏర్పాటుచేసి మహాపర్యాయ నిర్యాణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని, ఫిబ్రవరి నెలలో విజయవాడలో బుద్ధంశరణం గచ్ఛామి, ఆటపాకలో ఫెలికాన్ ఫెస్టివల్, నాగాయలంకలో పడవల పోటీలు నిర్వహించి పర్యాటకులను ఆకర్షించే విధంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. జిల్లాలో అమలు జరుగుతున్న పైలెట్ ప్రాజెక్టులను సోమాలియా, మొరాకో, అమెరికా వంటి దేశాలు ఆసక్తిగా పరిశీలించి ప్రశంసిస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ బి.ఆర్.అంబేద్కర్, ఆర్‌డిఒ జె.ఉదయభాస్కర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అంబటి శేషుబాబు, ప్రేమ్‌నాథ్, సీనియర్ పాత్రికేయులు నందం రామారావు, కె.వి.కృష్ణారావు, కృష్ణప్రసాద్, వినయ్‌కుమార్, కె.శ్రీను, కె.జాకబ్, ఎస్.ప్రసాద్, ఫయాజ్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ముద్రించిన 2018 డైరీని కలెక్టర్ ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్‌ను ఘనంగా దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు.